ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 16 సెప్టెంబరు 2025

గురువులొస్తున్నారు



- ఉమ్మడి జిల్లాలో 680 పోస్టుల భర్తీకి శ్రీకారం
- మెగా డీఎస్సీ తుది జాబితా విడుదల
- 19న ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు
- 22 నుంచి శిక్షణ తరగతులు
- దసరా సెలవుల అనంతరం విధుల్లో మాస్టార్లు
- డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరిపోనుంది. దసరా సెలవుల తర్వాత స్కూళ్లకు ఉపాధ్యాయులు రానున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ-2025 నిర్వహించి 16,347 మందిని ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 19న స్వయంగా నియామకపత్రాలు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి రాజధాని అమరావతి సచివాలయం సమీపంలో బహిరంగ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధ్యాయులతో నిర్వహించే సభను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఈ సభలో పాల్గొనేందుకు అవసరమైన ఆహ్వానాలను నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అధికారులు అందజేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థి తనతో పాటు కుటుంబంలోని మరో వ్యక్తిని కూడా సభకు తీసుకువచ్చేందుకు అనుమతి ఇచ్చారు. వీరందరు సభకు హాజరయ్యేందుకు ప్రతి మండలం నుంచి ప్రత్యేకంగా బస్సును ఏర్పాటుచేస్తున్నారు. ఆ బస్సుల ఏర్పాటు బాధ్యతను విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది.

నూతన ఉపాధ్యాయులకు 22 నుంచి శిక్షణ

దసరా సెలవుల సమయంలో జిల్లాల వారీగా ఈనెల 22 నుంచి 29 వరకు 8 రోజుల పాటు నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ నిర్వహించనున్నారు. ఈ శిక్షణ ద్వారా వారి బోధన నైపుణ్యాలను అభివృద్ధి చేసి, సమాజ అభివృద్ధి కోసం నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో సేవలు అందించేలా వారిని ప్రేరేపిస్తారు. ట్రైనింగ్ సమయంలోనే కౌన్సెలింగ్ నిర్వహించి ప్లేస్‌మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. దసరా సెలవులు పూర్తయిన తర్వాత నూతన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధులు చేపడతారు.

680 పోస్టుల భర్తీకి శ్రీకారం

మెగా డీఎస్సీ-2025 అభ్యర్థుల తుది జాబితాలో 680 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, పురపాలక (జిల్లాస్థాయి) విభాగంలో 705 పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం (జిల్లాస్థాయి) విభాగంలో 4 పోస్టులు, జువైనల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 3 పోస్టులు మొత్తంగా జిల్లాస్థాయిలో 712 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు కడప, ప్రొద్దుటూరు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. మెరిట్ జాబితాను గత నెలలో ప్రకటించారు. ఆగస్టు 11న వ్యక్తిగత స్కోర్ వివరాలు వెల్లడించారు. అదే నెల 23న ఎస్జీటీ మెరిట్ జాబితా ప్రకటించారు. వీటి భర్తీ కోసం ఉమ్మడి కడప జిల్లాలో ప్రకటించిన మెరిట్ లిస్ట్ నుంచి రిజర్వేషన్, నియమ నిబంధనలకు అనుగుణంగా గత నెల 26 నుంచి 28 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఉమ్మడి కడప జిల్లాలో 712పోస్టులకు గాను 680 పోస్టులకు తుదిజాబితాను సోమవారం విడుదల చేశారు. వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవడంతో 32 మందిని అనర్హులుగా ప్రకటించారు.

680 పోస్టుల వివరాలు ఇలా..

● స్కూల్ అసిస్టెంట్లు

సంస్కృతం	1
తెలుగు	25
ఉర్దూ	6
హిందీ	18
ఇంగ్లీష్	78
గణితం	44
గణితం (ఉర్దూ)	1
ఫిజికల్ సైన్స్	29
ఫిజికల్ సైన్స్ (ఉర్దూ)	1
బయలాజికల్ సైన్స్	50
బయలాజికల్ సైన్స్(ఉర్దూ)	2
సోషల్ స్టడీస్	58
సోషల్ స్టడీస్ (ఉర్దూ)	5
ఫిజికల్ ఎడ్యుకేషన్	80

● సెకండరీ గ్రేడ్ టీచర్లు

తెలుగు	254
ఉర్దూ	28

హెల్ప్ డెస్క్

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో మెగా డీఎస్సీ-2025కు సంబంధించి ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను సవివరంగా పరిశీలించిన అనంతరం మేనేజ్‌మెంట్ వారీగా, పోస్టుల వారీగా తుది ఎంపిక జాబితాలను రూపొందించి విడుదల చేశారు. జాబితాలపై సందేహాల నివృత్తి కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశారు. అభ్యర్థులు అవసరమైతే హెల్ప్‌డెస్క్‌కు సంబంధించి డీఈఓ కార్యాలయం సహాయ సంచాలకులు అనిల్‌కుమార్ సెల్ 995932220, పర్యవేక్షకుడు ప్రదీప్‌కుమార్ సెల్ నెంబర్ 9948121966ను సంప్రదించవచ్చు.

తుది ఎంపిక జాబితా విడుదల

మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితాను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేశారు. ముఖ్యమంత్రిగా గత ఏడాది నారా చంద్రబాబునాయుడు సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్‌పై తన మొదటి సంతకం చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ విజయవంతంగా మెగా డీఎస్సీ-2025ను పూర్తిచేసింది. మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితా సోమవారం ఉదయం 9.30నుంచి అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీడీఎస్‌సీ.ఎపిసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా అదుబాటులో ఉంచారు.




చెక్క ముక్కలైన కళ

- నాడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- నేడు ఆదరణలేక.. కూలీలుగా కళాకారులు
- చతికిలపడ్డ శెట్టిగుంట చెక్కబొమ్మల వ్యాపారం

6

దామరచర్లలో భారీ భూ కబ్జా



6

నూతన ఎస్పీగా ధీరజ్ బాధ్యతలు



రాయచోటిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా ఎస్పీగా ధీరజ్ కునుబిల్లి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లాలో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి ఎస్పీగా వచ్చారు. గతంలో పనిచేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కృష్ణాజిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్పీ ఏఆర్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తానన్నారు. అలాగే జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలందరూ భయరహితంగా జీవించేలా చూడటం పోలీసుశాఖ ధ్యేయమన్నారు. మహిళా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ శక్తి టీమ్స్ బలోపేతం చేయడం, పోలీసు సిబ్బంది సంక్షేమం, శిక్షణ, వృత్తి, అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో నేర రహిత సమాజాన్ని స్థాపిస్తానని ఎస్పీ స్పష్టం చేశారు.

నేపథ్యం ఇలా...

2020 బ్యాచ్‌లో ఐపీఎస్‌కు, 2021లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వీరి తల్లి పార్వతి (గృహిణి), తండ్రి కె.వెంకట్రమణ అడిషనల్ ఎస్పీగా శ్రీకాకుళం జిల్లాలో విధులు నిర్వర్తిసున్నారు. ఐఏఎస్‌గా ఎంపికైనప్పటికీ తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని ఐపీఎస్‌గా కొనసాగుతున్నారు. కాగా సోమవారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే, మదనపల్లి డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

మెడికల్ కళాశాల సేఫ్ క్లోజర్‌కు నిర్ణయం

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలోకి మార్చడంతో ఇప్పటి వరకు నిర్మించిన భవనాలు, ఇతర నిర్మాణాలను సేఫ్ క్లోజర్ కింద రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ చిరంజీవి సోమవారం మదనపల్లె మెడికల్ కళాశాలను సందర్శించారు. ఇక్కడ మూడు బ్లాకుల్లో నిర్మించిన భవనాలు ఏదశలో వున్నాయి, ఎంతవరకు నిర్మాణం పూర్తి చేశారు, తదితర అంశాలను, మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను ఎస్ఈ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్న మయ్య జిల్లా మదనపల్లె, సత్యసాయి జిల్లా పెనుగొండ మెడికల్ కళాశాలకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో ఎస్ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ కళాశాల భవన నిర్మాణాల్లో ఇప్పటివరకు రూ.63.7 కోట్లు, పెనుగొండ మెడికల్ కళాశాల భవనాలకు రూ.55కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్ఐ డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శివరామిరెడ్డి, శ్రీనివాసులునాయుడు, ఎలక్ట్రికల్ ఇంజనీర్ చిదంబరం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచాలి

- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచాలని సీఎం నారా చంద్రబాబునాయుడు సోమవారం పేర్కొన్నారు. విజయవాడలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో మొదటిరోజు ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మదనపల్లె, రాయచోటి ప్రాంతాల్లో ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఆధారిత రైతులు ఎక్కువగా ఉన్నారని, వర్షపాతం తక్కువగా ఉండడం వల్ల ఈ సంవత్సరం సాగు తక్కువగా ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అనువైన ప్రాంతాల్లో ఉద్యానవన పంటల సాగు పెంచేందుకు కృషి చేస్తామని వివరించారు.

ప్రతి అర్జీ పరిష్కరించాలి : డీఆర్వో

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని డీఆర్వో మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్య క్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో నిశితంగా అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరి మితిలోగా ప్రజా సమస్యలను పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన కొన్ని దరఖా స్తులను పరిశీలిచంగా.. రాయచోటి మండ లం చెన్నముక్కపల్లి గ్రామం దూళ్లవారిపల్లెకు చెందిన నల్లమల రామయ్య వృద్ధాప్య పింఛన్ ఇప్పించాల్సిందిగా వినతి ఇచ్చారు. చిన్నమండెం మండలం కేశాపురం రెడ్డివారి పల్లెకు చెందిన ఆవుల హరి రెండేళ్ల క్రితం ప్రమాదం వల్ల తన ఎడమ కాలు పూర్తిగా నలిగిపోయిందని, పూర్తిగా మంచానికి పరిమి తమయ్యాయని వికలాంగుల పింఛన్ ఇప్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదే మండలం మల్లూరు కొత్తపల్లి గ్రామానికి చెందిన రామారావు తనకు ఇద్దరు కుమా రులు ఉన్నారని, భార్య రామాంజులమ్మ అక్టోబరు 4న మరణించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికివందనం పథకం మంజూరు చేయాల్సిందిగా డీఆర్వో కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం ఏవో నాగభూషణం, ఎస్‌డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అర్జీ పరిష్కరించాలి : డీఆర్వో

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన ఓ బాలిక శనివారం వారి పొలం వద్ద వుండగా మాలేపాడు పంచాయతీ దేవళం పల్లెకు చెందిన నరసింహులు(30) ఆ బాలికపై అత్యాచారం చేశాడు. ఈ యువకుడు ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ మేరకు తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా తన కుమార్తెను అత్యాచారం చేసిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బాలిక తండ్రి సబ్‌కలెక్టర్‌కు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె రెండు రోజుల క్రితం పశువులు మేపేందుకు పొలానికి వెళ్లిందన్నారు. అక్కడ తమ గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహులు తన కుమార్తెపై అత్యాచారం చేసి పారిపోయాడని, తీవ్ర రక్తస్రావంతో వున్న తన బిడ్డను ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామన్నారు. గతంలో కూడా ఈ నిందితుడు ఓ బాలికను అత్యాచారం చేశాడని, పైగా నాటుబాంబులు తయారు చేస్తూ గ్రామ ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంటాడని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ విషయమై డీఎస్పీ మహేంద్రకు ఫోన్ చేసి వెంటనే నిందితుడిని అరెస్టు చేయాలని సబ్‌కలెక్టర్ కళ్యాణి సూచించారు.

తంబళ్లపల్లెలో :

మండలంలోని ఓ గ్రామంలో బాలికపై ఓ బాలుడు లైంగిక దాడికి పాల్పడిన అమానుష ఘటన వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు... మండలానికి చెందిన ఓ ఆరేళ్ల బాలిక అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ బాలుడు యేసు (12) ఆదివారం సాయంత్రం బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కూలి పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన అమ్మమ్మ ఏడుస్తున్న బాలికను గమనించి వివరాలు అడగ్గా జరిగిన ఘాతుకాన్ని తెలిపింది. దీనిపై ఆమె సోమవారం తంబళ్లపల్లె పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించామన్నారు.

ఆహా ఛీఛీ అనాలా...


- అసంపూర్తిగా మదనపల్లె మెడికల్ కళాశాల
- పూర్తయిందంటూ.. జగన్ నోట అబద్ధాలు..



జగన్ చెబుతున్న మదనపల్లె మెడికల్ కళాశాల

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): 'మేము.. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు తెచ్చాం.. అందులో సుమారు ఐదు పూర్తి చేశాం.. మేము నిర్మించిన కళాశాలల ముందు వెళ్తున్న ఎవరైనా.. తల పైకి ఎత్తి.. ఆహా అని అనాల్సిందే.. వాస్తవానికి గత విద్యాసంవత్సరమే పులివెందుల, మార్కాపురం, మదనపల్లె, ఆదోనిలలో తరగతులు మొదలు పెట్టాల్సింది. కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ కాలేజీలకు అనుమతుల కోసం ప్రయత్నించలేదు. దీంతో రాష్ట్రంలో వందలాది విద్యార్థులు అవకాశాలు కోల్పోయారు' ఇదీ గత వారం పది రోజులుగా.. మాజీ సీఎం జగన్.. వారి పార్టీ నాయకులు చెప్తున్న మాటలు.. ఇవి విన్న వాళ్లు నిజమేనేమో... జగన్‌మోహన్‌రెడ్డి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అన్ని హంగులతో మెడికల్ కళాశాలలు నిర్మించినా... కూటమి ప్రభుత్వం వాటికి అనుమతులు కోరలేదేమో అని అనుకుంటారు. ఈ నేపథ్యంలో.. మదనపల్లె మెడికల్ కళాశాల విషయంలో వైఎస్ జగన్.. వైసీపీ నాయకులు చెప్తున్నదేంటి..? వాస్తవ పరిస్థితులు ఏంటి అని ఆంధ్రజ్యోతి పరిశీలించి ఇచ్చిన కథనం.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద 99 ఎకరాలను మెడికల్ కళాశాలకు కేటాయించారు. ఈ పనులకు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. తర్వాత సుమారు ఏడాది పాటు.. కనీసం ఒక ఇటుక కూడా వేయలేదు. నిర్మాణ పనులు అసలు మొదలే కాలేదు. 2023లో భూమి చదును పనులు మొదలయ్యాయి. మెగా ఇంజనీరింగ్ సంస్థ రూ.475 కోట్లతో టెండర్ దక్కించుకున్నా.. అగ్రిమెంట్ కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. ఇలా ఏదో ఒక కారణంతో.. ఒకటిన్నర సంవత్సరం పాటు.. మెడికల్ కళాశాల పనులు ఒక అడుగు కూడా ముందుకు కదల్లేదు. తర్వాత పనుల వేగం పెంచారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించడానికి అవసరమైన నిర్మాణాలను చేపట్టారు. ముఖ్యంగా మూడు దశల్లో మెడికల్ కళాశాల నిర్మాణం జరిగింది. భవనాలు, బాయ్స్, గర్ల్స్ హాస్టల్, లెక్చరర్ గ్యాలరీలు, మొదటి బ్లాక్‌లో మెడికల్ కళాశాల భవనం. జీప్లస్ త్రీ నిర్మాణం పూర్తయింది. ప్లాస్టరింగ్ చేయాల్సి ఉంది. రెండో బ్లాక్‌లో లెక్చరర్ గ్యాలరీలో జీ ప్లస్ వన్ కంప్లీట్ అయ్యింది. రెండు, మూడు ఫ్లోర్లు ఇంకా నిర్మించాల్సి ఉంది. మూడో బ్లాక్‌లో బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో బాయ్స్ హాస్టల్ జీ ప్లస్ ఫైవ్ నిర్మాణం పూర్తయింది. ప్లాస్టరింగ్ చేయాల్సి ఉంది. గర్ల్స్ హాస్టల్ కూడా నిర్మాణం పూర్తయింది. ఐదు అంతస్తులు ప్లాస్టరింగ్ చేయాల్సి ఉంది. మెడికల్ కళాశాల, హాస్టల్స్‌కి నీటి సరఫరా చేసేందుకు జీఎల్‌బీఆర్ నిర్మాణానికి పునాదులు తవ్వారు.. ప్లింత్ బీములు వేశారు. రెండు భారీ సంపులను కూడా నిర్మించారు. కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం జరగలేదు. అయితే హాస్టల్ భవనాలు ల్యాబ్లు, లైబ్రరీ, భవనాలు 70 శాతం దాకా పూర్తి చేశారు.



మెడికల్ కళాశాల ఆవరణలో పెద్దపెద్ద గుట్టలు, పూర్తి కాని నిర్మాణాలు

మెడికల్ కళాశాలకు అవసరమైన హాస్పిటల్ కోసం మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలపైన సుమారు రూ.9కోట్లు వ్యయం చేసి 250 పడకల తాత్కాలిక భవనాలు నిర్మించారు. కేవలం కొన్ని భవనాలు మాత్రమే దాదాపు 70 నుంచి 80 శాతం వరకు పూర్తయ్యాయి. కనీసం ఒకటంటే.. ఒక భవనం కూడా అన్ని సౌకర్యాలు, మౌలిక వసతులతో పూర్తి కాలేదు. తరగతులు నిర్వహించేందుకు.. అనువుగా లేవు. రోడ్లు, వీధిలైట్లు, నీటిసౌకర్యం లేదు. ప్రస్తుతానికి నివాస యోగ్యంగా లేదు. తరగతులు బోధించేందుకు.. లెక్చరర్లకు గ్యాలరీలు కూడా పూర్తి కాలేదు. ఈ పరిస్థితుల్లోనే... 2024 మొదట్లో వైసీపీ ప్రభుత్వం హడావిడిగా నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ని ఈ కళాశాల పరిశీలనకు పిలిపించింది. అయితే ఎన్ఎంసీ బృందంలోని సభ్యులు మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించి ఇక్కడ ఈ ఏడాది తరగతులు ప్రారంభించడానికి వీలుపడదని ఢిల్లీలోని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు నివేదికను అందజేసింది. దీంతో మదనపల్లి మెడికల్ కళాశాల నిర్మాణం అటకెక్కింది. ఇక్కడ ఉన్న విలువైన యంత్ర పరికరాలు ఇతర సామగ్రిని మెగా సంస్థ తిరిగి తీసుకెళ్లిపోయింది.



అసంపూర్తిగా మదనపల్లె మెడికల్ కళాశాల

అయితే ఈ విషయాలను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే దాచిపెట్టి.. మదనపల్లె మెడికల్ కళాశాల సర్వహంగులతో తమ ప్రభుత్వం పూర్తి చేసినా.. కూటమి ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఇక్కడ తరగతులు నిర్వహించేందుకు అనుమతులు కోరలేదని అబద్ధాలు చెప్పారు. అంతటితో ఆగకుండా.. తాము నిర్మించిన భవనాలను చూసి.. ఆహా అనాలంటున్నారు. అయితే స్థానికులు మాత్రం మదనపల్లె మెడికల్ కళాశాల విషయంలో వైసీపీ అధినేత, ఇతరా నాయకుల మాటలు విని.. ఛీఛీ అంటుండడం విశేషం.

చెక్కముక్కలైన కళ

- నాడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- నేడు ఆదరణలేక.. కూలీలుగా కళాకారులు
- చతికిలపడ్డ శెట్టిగుంట చెక్కబొమ్మల వ్యాపారం
- 20 కుటుంబాలకు.. మిగిలింది ఒక్క కుటుంబమే




శెట్టిగుంట కళాకారుల చేతిలో చెక్కతో రూపుదిద్దుకున్న బొమ్మలు

అంతర్జాతీయ స్థాయిలో శెట్టిగుంట చెక్కబొమ్మలకు పేరు గాంచింది. గతంలో అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌కు కూడా శెట్టిగుంట చెక్కబొమ్మలను ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బిల్‌క్లింటన్‌కు శెట్టిగుంట చెక్కబొమ్మను అందజేశారు. ఆయన వీరి పనితనం చూసి ముగ్ధులయ్యారు. చెక్కబొమ్మలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి మంచి ఆదరణ కల్పిస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. హైదరాబాదులో ఒక స్టాల్ కూడా ఏర్పాటు చేయించారు. బొమ్మలు విపరీతంగా అమ్ముడుపోయాయి. అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చింది. కళాకారులకు చేతి నిండా పని, డబ్బులు ఉండేవి. కాల క్రమేణా చెక్కబొమ్మలకు ఆదరణ తగ్గి మార్కెటింగ్ లేక కళాకారులు ఇక్కట్లకు గురయ్యారు. వివిధ రకాల చేతివృత్తులు, కూలి పనులతో పొట్టపోసుకుంటున్నారు. 20 కుటుంబాలకుగాను ఒక్క కుటుంబం మాత్రమే శెట్టిగుంటలో మిగిలింది. మిగిలిన కళాకారులు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు.

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలోని పంచాయతీ కేంద్రమైన శెట్టిగుంటలో చెక్కబొమ్మలు తయారు చేసే కుటుంబాలు 20 ఉన్నాయి. సుమారు 100 సంవత్సరాల నుంచి ఇదే వృత్తిగా వీరు జీవనం సాగిస్తున్నారు. రానురాను ఈ బొమ్మలకు డిమాండ్ ఏర్పడింది. 20 కుటుంబాల్లో సుమారు 40 మంది కళాకారులు ఉండేవారు. శెట్టిగుంట ప్రాంతంలో లభించే టేకు, ఎర్రచందనం కొయ్యలను సేకరించి బొమ్మలు తయారుచేసి అమ్ముకుని వచ్చేవారు. మొదట తిరుపతి, హైదరాబాద్ తర్వాత తమిళనాడు, కేరళ తదితర ప్రాంతాల్లో బొమ్మల అమ్మకాలు చేపట్టారు. డిమాండ్ పెరగడంతో బొమ్మల తయారీని వేగంగా చేసేవారు.

కొయ్యలకు అనుమతి లేక..

శెట్టిగుంట కళాకారుల చేతుల్లో రకరకాల దేవతామూర్తులు రూపు దిద్దుకుంటున్నారు. కొయ్యతో వినాయకుడు, వెంకటేశ్వరుడు, లక్ష్మీదేవి, కృష్ణుడు, బుద్ధుడు, అన్నమయ్య, సీతారాములు, పల్లెపడుచు.. ఇలా రకరకాల బొమ్మలను తయారు చేసేవారు. ఈ బొమ్మలతోనే శెట్టిగుంట పేరు ప్రసిద్ధిగాంచింది. అయితే అడవిలో లభించే కొయ్యలు తెచ్చుకోవడానికి అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వలేదు. కళాకారులు డిమాండ్ చేయడంతో గతంలో కొంతవరకు అనుమతి ఇచ్చారు. తర్వాత ఎర్రచందనం కొయ్యలు ఇవ్వడం ఆగిపోయింది. అటవీశాఖ నుంచి అనుమతి ఇప్పించి ఆదుకోవాలని కళాకారులు ఎందరో ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసినా ప్రయోజనం శూన్యం. దీంతో కొయ్య కొరత ఏర్పడింది.

రూ.2వేల నుంచి రూ.15వేలు

అడవుల్లోని కొయ్యను తెచ్చుకోవడానికి అనుమతులు రాకపోవడంతో వ్యవసాయ రైతుల తోటల్లో ఉన్న కొయ్యలను కొనుగోలు చేసి బొమ్మలు తయారు చేశారు. ఒక్క అడుగు బొమ్మను 2 నుంచి 3 రోజుల్లో తయారు చేసేవారు. 2 నుంచి 5 అడుగుల బొమ్మలను సుమారు పది రోజుల్లో తయారు చేసేవారు. దేవుడి బొమ్మలు అసలు దేవుడే దిగి వచ్చాడన్నంత అందంగా తీర్చిదిద్దేవాళ్లు. ఒక్క అడుగు బొమ్మను రూ.2వేలు, రెండు అడుగుల బొమ్మను రూ.3 వేలు, ఐదు అడుగుల బొమ్మను రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్మకాలు చేసే వారు. బొమ్మను బట్టి డిమాండ్ ఉండేది.

కొయ్య, మార్కెటింగ్ లేక..

రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో కళాకారులకు శెట్టిగుంటలో ఒక కమ్యూనిటీ హాలును నిర్మించారు. అందులో చెక్కబొమ్మల తయారీ చేపట్టారు. హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా బొమ్మల విక్రయాలను కొంత కాలం సాగించారు. రాను, రాను ఈ బొమ్మలకు కొయ్యలు లభించకపోవడం, తగిన మార్కెటింగ్ లేకపోవడంతో బొమ్మల తయారీ తగ్గిపోయింది. దీంతో కళాకారులకు జీవనోపాధి పూర్తిగా లేకుండా తగ్గిపోయింది. ఉన్న స్టాల్స్‌ను కూడా ఎత్తివేశారు. 19 కుటుంబాల వారు నాయుడుపేట, తిరుపతి, రైల్వేకోడూరు తదితర ప్రాంతాలకు వెళ్లి చేతివృత్తులు, కొందరు కూలిపనులు, మరికొందరు గల్ఫ్‌దేశాలకు వెళ్లి చాలీచాలని జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అయినా తమను ఆదుకుంటే వలస వెళ్లిన కుటుంబాలు మళ్లీ శెట్టిగుంటకు వస్తాయని, తిరిగి చెక్కబొమ్మల వైభవాన్ని తీసుకుని వస్తామని కళాకారులు అంటున్నారు.



మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



చెక్కబొమ్మలకు గతంలో డిమాండ్ ఉండేది. మార్కెటింగ్ లేకపోవడంతో ప్రస్తుతం డీలా పడిపోయింది. పూర్తిగా అమ్మకాలు లేక బొమ్మలు మూలనపడి ఉన్నాయి. 20 కుటుంబాలకు ఒక్క కుటుంబం మాత్రమే ఆర్డర్‌ను బట్టి కొన్ని బొమ్మలను తయారు చేసి విక్రయిస్తున్నారు. అది కూడా ఎప్పుడో ఆర్డర్ వస్తుంది. కూటమి ప్రభుత్వం అయినా శెట్టిగుంట చెక్కబొమ్మలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.

- సాలాపక్షి చంద్రశేఖర్, చెక్కబొమ్మల వ్యాపారి, శెట్టిగుంట

ఎర్రచందనం కొయ్యలు ఇవ్వాలి



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం కొయ్యలకు ధర నిర్ణయించి మాకు ఇస్తే బొమ్మలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాము. కొయ్య లేక పనులు చేసేందుకు వీలుకావడం లేదు. చేసిన బొమ్మలు అమ్ముడు పోవడం లేదు. కొయ్యలేక, బొమ్మలకు గిరాకీ లేక చాలా మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. చాలీచాలని కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. శెట్టిగుంట చెక్కబొమ్మల కళాకారులను ఆదుకోవడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

- సాలాపక్షి మునెయ్య, కళాకారుడు, శెట్టిగుంట

ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయరాదు : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెస్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి నిర్వ హించారు. ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను నేరుగా విని ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు తదితర సమస్యలపై ఎస్పీ స్వయంగా విచారణ జరిపారు. అనంతరం ఎస్పీ ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించాలని, ఆలస్యం చేయరాదని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు.

మార్కెట్ కమిటీ సభ్యుల నియామకం

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా దోబూచులాడుతున్న మదనపల్లె మార్కెట్ కమిటీ సభ్యుల నియామకంపై సీఎం పేషీ జోక్యంతో ఎట్టకేలకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ప్రభుత్వానికి అధిక ఆదాయం ఒనగూర్చే మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీకి జూలై 16న మదనపల్లె జనసేన నేత జంగాల శివరామ్‌ను నియ మిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ పదవిపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో తమ బాధను వెళ్లగక్కారు. అప్పటి నుంచి రెండు నెలలుగా మదనపల్లె మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు, సభ్యుల నియామకం పెండింగ్‌లో పడి పోయింది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు పేషి ఈ విష యంలో జోక్యం చేసుకోవడంతో సీఎం కార్యదర్శి ఏవీ రాజమౌళి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17న ఈ మేరకు జీవో విడుదల చేయాలని ముక్తాయించారు.

సీఎం పేషి నుంచి వచ్చిన జాబితా ప్రకారం

మదనపల్లె మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా జంగాల శివరామ్, ఉపాధ్యక్షుడిగా ఆర్.ఆంజినేయులు, సభ్యులుగా ఎం.రమణమ్మ, ఆర్.సుబ్రమణ్యంరెడ్డి, బి.ప్రమీల, సి.నరసింహులు, పులి మహాలక్ష్మి, బి.మున్నా నాయక్, ఇ.రెడ్డిశేఖర, బి.మణి, పి.వాణి, బి.శ్యామలమ్మ, బి.సంధ్యారాణి, జి.లక్ష్మీపతి, ఆర్.అరుణలను నియమించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

మోటారు క్యాబ్, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

రాయచోటి కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటో రిక్షా, మోటారు క్యాబ్ తదితర వాహనాల డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. వాహనాలకు ఏపీలో రిజిస్ట్రేషన్ కలిగి ఉండడంతో పాటు, డ్రైవరుకు లైసెన్సు. ఫిజికల్ ఫిట్నెస్, బీపీఎల్ రేషన్‌కార్డు కలిగి ఉండాలి. దరఖాస్తుదారు కుటుంబ సభ్యుల్లో పెన్షనర్లుగానీ, ప్రభుత్వ ఉద్యోగులు కానీ ఉండరాదు.. గృహంలో విద్యుత్ వినియోగం 300 యూనిట్లు కంటే తక్కువగా ఉండాలి. వాహనంపైన రుణ బకాయిలు ఉండరాదు. వాహనదారుడికి మూడు ఎకరాల కన్నా ఎక్కువ మాగాణి గానీ, మెట్ట అయితే 10 ఎకరాలకు పైగా ఉండరాదు. పట్టణ ప్రాంతాల్లో కమర్షియల్ భవనం, గృహాలు 1000 గజాలకు మించకుండా ఉండాలి. పై అర్హతలు కలిగిన క్యాబ్ లేక ఆటో డ్రైవర్లు సచివాలయంలో ఈ నెల 19వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నమయ్య జిల్లా రవాణాశాఖ అధికారి కె.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

దామరచర్లలో భారీ భూ కబ్జా

- రెండు రోజుల సెలవులతో ఆక్రమణకు యత్నం
- రెవెన్యూ సిబ్బందికి రూ.లక్షల్లో ముడుపులు ?



దామరచర్ల పరిధిలో అక్రమార్కులు చదును చేసిన బంజరు భూములు

పెనగలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని దామరచర్లలో రెండు రోజులుగా భారీ భూ కబ్జా జరిగినట్లు ప్రజలు చర్చించు కుంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు 50 ఎకరాల పైబడి బంజరు భూములను స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతోనే చదును చేసినట్లు సమాచారం. ఇందుకు నెల రోజుల నుంచి పన్నాగం వేయగా, ఈ నెల రెండో శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో తమ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని స్థానిక అధికారులు భరోసా ఇవ్వడంతోనే కబ్జాదారులు రెచ్చిపోయినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సుమారు పదేళ్లుగా ఈ గ్రామ పరిధిలో ఆగిపోయిన భూకబ్జాలు ఇటీవల రెండు, మూడు నెలల నుంచి మండలంలో మళ్లీ ఊపందుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా 2018 నుంచి దామరచర్ల పరిధిలో గల భూములకు ఎటువంటి కోర్టు ఆదేశాలు లేవని, 10 రోజుల కిందట ఇద్దరు వ్యక్తులు అనధికారికంగా బోరు వేసుకుని కరెంటు తీసేందుకు స్తంభాలు కూడా నాటినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఏకంగా డోజర్లు, జేసీబీ యంత్రాలు పెట్టి బంజరు భూముల చదునుకు శ్రీకారం చుట్టారు. ఉన్నతాధికారులు స్పందించి పెనగలూరు రెవెన్యూ సిబ్బందిని కట్టడి చేయకపోతే మండలంలో అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేసేందుకు ఎక్కడా సెంటు భూమి కూడా మిగలదని ప్రజలు భావిస్తున్నారు.

ఈ విషయంపై పెనగలూరు తహసీల్దారు డి.అమరేశ్వరిని వివరణ కోరగా దామరచర్ల పరిధిలో 2018 నుంచి ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన భూములు కోర్టు పెండింగ్‌లో ఉన్నాయని, ఇటీవల 10 రోజుల కిందట ఆదేశాలు రావడంతో ఇద్దరు వ్యక్తులు చదును చేసినట్లు తెలిపారు.

రుషివాటిక ఘటనపై కేసు నమోదు

- ఉద్దేశ్యపూర్వకంగానే దాడి చేశారని ఫిర్యాదు

బి.కొత్తకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని రుషివాటిక ఆశ్రమ పాఠశాలలో ఇటీవల జరిగిన అవాంఛనీయ ఘటన పై కేసు నమోదైంది. ఈ పాఠశాలలో చదువుతున్న శేషాద్రిరెడ్డి అనే బాలుడిపై దాడి జరిగింది. దీంతో కంటికి తీవ్రగాయమై కనుచూపు రావడం అసాధ్యమని వైద్యులు తెలిపిన నేపథ్యంలో బాలుడి తండ్రి లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన అమరనాథరెడ్డి బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రుషివాటిక పాఠశాల సిబ్బందిలో ఒకరైన వెంకటేశ్ ఉద్దేశ్యపూర్వకంగా రాయితో కొట్టడంతో కంటికి తీవ్రగాయమై కనుచూపు పోయిందన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే తమ బిడ్డ కన్ను పోయిందని యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ బిడ్డ కనుచూపు కోల్పోవడానికి కారకులు కావడమే కాకుండా తిరిగి తమపై పాఠశాల యాజమాన్యం బయటివ్యక్తులను రప్పించి భయపెట్టాలని చూస్తోందన్నారు. మదనపల్లెకు చెందిన ఓ బీజేపీ నాయకుడు రుషివాటికలో తమ బిడ్డపై జరిగిన దాడి విషయమై తప్పుడు సమాచారంతో పత్రికలు, పోలీసులను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని వాపోయారు. తాము వారితో దురుసుగా ప్రవర్తించామని, డబ్బులు డిమాండ్ చేశామని చెప్పడంలో నిజం లేదన్నారు. తమ బిడ్డకు ఎలా న్యాయం చేస్తారో మాత్రమే చెప్పాలని అడిగామన్నారు. తమ కుమారుడు పూర్తిగా కంటిచూపే కోల్పోతే కన్నుకు గాయమైందని, గీసుకుందని ప్రకటన చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ చేసి తమకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయమై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఏఎస్‌ఐ భాస్కరనాయక్ పేర్కొన్నారు.

తగు జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల నివారణ

- జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

గాలివీడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని జిల్లా మలేరియా అధికారి ఆర్. రామచంద్రారెడ్డి, నూలివీడు పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేతారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని చీమలచెరువుపల్లి పంచాయతీ కొప్పలవాండ్లపల్లెలో వారు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి రక్త నమూనాలను సేకరించి కడప రిమ్స్‌కు, మైక్రో బయాలజీ డిపార్టుమెంట్‌కు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం చికున్‌గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు సోకుతున్నాయని, వీటి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలోని లార్వా ఉన్న నీటిని ఆశ వర్కర్లతో తొలగించి అబేట్ పిచికారీ చేయించినట్లు తెలిపారు. రక్త నమూనాల ఫలితాలను బట్టి మరోసారి గ్రామాన్ని సందర్శించి తగిన వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్, ల్యాబ్ టెక్నీషియన్లు మధుసూదన్, శివశంకర్, ఏఎన్‌ఎం సుహాసిని, ఆశవర్కర్లు రమణమ్మ, శిరీష, శోభారాణి, ఎల్‌హెచ్‌పీ రెడ్డిసాయిచందన, వైద్య సిబ్బంది బాబా తదితరులు పాల్గొన్నారు.



కొప్పులవాండ్లపల్లెలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ పశు వ్యాధి నివారణ పథకంలో భాగంగా పశు వైద్యులు ఇంటి వద్దకే వచ్చి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పిలుపునిచ్చారు సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంపై గోడ పత్రికను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని తద్వారా ఆర్థిక అభివృద్ధిని సాధించవచ్చన్నారు. అన్నమయ్య జిల్లాలో సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

రాయచోటి-నేతాజీసర్కిల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాటిమాయకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఎస్.అజ్మత్ అలీ టేబుల్ టెన్నిస్ క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు సోమవారం తెలిపారు. ఈ నెల 12న కడప డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల పీడీ రమేశ్‌నాయక్, విద్యార్థి అజ్మత్‌అలీ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు.

పెనగలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అండర్-19 టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు పెనగలూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సహజబ్లెస్సీ, ఎస్సీ పీడీ సుబ్రహ్మణ్యం, కోచ్ ఎస్.గౌస్‌మొహిద్దీన్ తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జిక్లబ్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పెనగలూరు ఆదర్శ పాఠశాలకు చెందిన సయ్యద్ తౌఫిన్, మహేందర్, సాయిసందీప్, సుధీర్ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి



మృతి చెందిన బాలిక

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీలో అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు రాయచోటి మండల పరిధిలోని యండపల్లి ఎగువ కొత్తపల్లికి చెందిన రేకులకుంట మల్లికార్జున, అంజలి కొన్నేళ్లుగా రాయచోటిలో నివాసం ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. వీరి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కొత్తపేట రామపురంలోని జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. వీరిలో పెద్ద కూతురు లావణ్య (13). సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

కలకడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 10న ముడియంవారిపల్లె కొత్తపల్లెకు చెందిన ప్రవీణ్, అతని తండ్రి వెంకటరమణ, తల్లి సుబ్బమ్మపై అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి అతని అనుచరులు కొడవలితో దాడి చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితులైన ప్రసాద్‌రెడ్డితో పాటు గంగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పుష్పావతిలను కోన క్రాస్‌లో అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హరిబాబు, కరుణాకర్, విజయ్‌కమాల్ పాల్గొన్నారు.

మహిళా దొంగల ముఠా అరెస్టు



పట్టుబడిన కారు, నగదుతో డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్, సిబ్బంది

గోరంట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంకుల వద్ద రెక్కీ నిర్వహించడం, పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి ఆ సొమ్ము కాజేయడం మొదలెట్టారు. అలా.. 14 రోజుల వ్యవధిలో వేర్వేరు రాష్ట్రాల్లో ఏకంగా 10 చోరీలు చేశారు. అందుకోసం రెండు కార్లను తీసుకుని, ఇద్దరు డ్రైవర్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఆఖరుకు ఆ మహిళా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా ఆట కట్టించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గర్ జిల్లా కడియాసాన్సీ గ్రామానికి చెందిన దీప్ మాలాబాయి, పరిత సిసోడియా, రేఖా బాయి, మమత, మాలాబాయి, కారు డ్రైవర్ ప్రదీప్ సిసోడియా పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప.. దొంగల ముఠా అరెస్టు వివరాలను సోమవారం వెల్లడించారు. కడియాసాన్సీ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రెండు కార్లను తీసుకుని, చోరీలు మొదలెట్టారు. ఈనెల 3న గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్టేట్ బ్యాంకు(గోరంట్ల శాఖ)లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు. మధ్యలో ఓ దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆయనను బ్యాంకు వద్ద నుంచే రెండు కార్లలో మహిళా ముఠా వెంబడించింది. దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ద్విచక్రవాహనంలోని రూ.3.80 లక్షల నగదును చోరీ చేశాయి. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. దీప్ మాలాబాయి, పరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, మరో ఇద్దరు మహిళలు, ప్రదీప్, మరో కారు డ్రైవర్ ముఠా చోరీ చేసినట్లు గుర్తించారు. గోరంట్ల మండలంలో జాతీయర రహదారి పక్కనే కె హోటల్ వద్ద ఆదివారం ఐదు గురు మహిళలు, కారు డ్రైవర్ ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వరుస చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈనెల 3వ తేదీ మధ్య ఏకంగా పది చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. కడప జిల్లా పులివెం దుల, జమ్మలమడుగులో మూడు, తెలంగాణలో మూడు, నంద్యాల జిల్లా, కర్ణాటక, ఒడిశాలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున మొత్తం పది చోరీలు చేసి, రూ.12.59 లక్షలు అపహరించారు. వారి నుంచి మొత్తం 7.50 లక్షలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు.. కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య పేర్లను రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో చొరవ చూపిన కానిస్టేబుళ్ల వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, హోంగార్డు ప్రియాంకకు నగదు బహుమతులను డీఎస్పీ అందజేశారు. ముఠాలో మరో ఇద్దరు వహిళలు, డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజాసమస్యలపై అలసత్వం వహించవద్దని... తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కడప సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, ఇతర ప్రత్యేక విభాగాల అధి కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే పోలీసు అధికారులపై చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్య కలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారితో వ్యక్తిగతంగా ఇంటరాక్ట్ అవుతామన్నారు. హోంగార్డు స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు తనను ఎప్పుడైనా కలవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ (ఏ ఆర్) రమణయ్య, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, కడప సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, ప్రత్యేక విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కడప రిమ్స్ పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



కడప వైద్యకళాశాల పీజీ వైద్య విద్యార్థినులు డాక్టర్ వీజే ఆర్ష, డాక్టర్ బి.సుధేష్ణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జమున

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో పీజీ చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులకు వివిధ కేటగిరీలలో ప్రతిభ చాటారు. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈనెల 12, 13, 14 తేదీల్లో ఏడవ ఏపీఎం ఏపీ స్టేట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల పెథాలజీ మొదటి సంవత్సరం పీజీ విద్యార్థిని డాక్టర్ వీజే ఆర్ష తమ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ డి.కళ్యాణి మార్గదర్శకత్వంలో ప్రజెంట్ చేసిన పోస్టర్ ప్రజెంటేషన్‌కు మొదటి బహుమతి లభించింది. ఈ బహుమతిని అందుకున్న డాక్టర్ వి.జె.హర్షను కడప వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున అభినందించారు. అలాగే మంగళగిరి ఎయిమ్స్‌లో సెప్టెంబరు 13, 14 తేదీలలో ఏపీఏఆర్ఓఐసీఓఎన్ 2025 రాష్ట్ర రేడియేషన్ అంకాలజిస్టుల సదస్సు నిర్వహించారు. ఇందులో కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం రేడియేషన్ అంకాలజిస్ట్ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థిని డాక్టర్ బి.సుధేష్ణ తమ గైడ్ డాక్టర్ ప్రవీణ మార్గదర్శకత్వంలో చేసిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున అభినందనలు తెలిపారు.

హైదరాబాద్, చెన్నై రైళ్లను ఆపాలి



స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కన్‌సల్టేటివ్ మెంబర్లు

కొండాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, చెన్నై రైళ్లను కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆపాలని కన్సల్టేటివ్ మెంబర్‌లు కోరారు. సోమ వారం వారు స్టేషన్‌మాస్టర్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కరోనా ముందు కొండాపురం స్టేషన్‌లో ఆగే కాచిగూడ- చిత్తూర్ ఎక్స్‌ప్రెస్ (12797/12798), ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22159/22160) రైళ్లకు తిరిగి స్టాపింగ్ పునరుద్ధరించాలని కోరారు. ఇటీవల కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ పునరద్ధరించిన విధంగా, ఈ రైళ్లకు స్టానింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్‌సల్టేటివ్ మెంబర్లు శ్రీరామ్‌రెడ్డి, మనోహర్‌బాబు, నాగేష్, సాయిచరణ్, ఖాదర్‌భాషా, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్య పరికరాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర్ల సేద్య పరికరాలు రైతులు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా పథక సంచాలకులు వెంకటేశ్వర్‌రెడి అన్నారు. సోమవారం మండలంలోని రంగసముద్రం రైతు సేవా కేంద్రంలో పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలో వ్యవసాయ, ఉద్యాన గ్రామ సహాయకులకు బిందు, తుంపర్లసేద్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వవిహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పంటల్లో డ్రిప్ ఇరిగేషను పద్ధతిలో మొక్కలకు కావాల్సిన ఎరువులు, ఇతర పోషకాలను నీటితో పాటు అందించడం ద్వారా ఎరువుల ఆదా జరుగుతుందన్నారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న సన్న చిన్న కారు రైతులకు 90శాతం రాయితీతో గరిష్ఠంగా 2.18 లక్షల వరకు బిందు సేద్య పరికరాలు అమర్చుకోవచ్చన్నారు. 5-10 ఎకరాల మధ్య భూమి కలిగిన పెద్ద రైతులకు రాయితీతో గరిష్ఠంగా 3.46 లక్షల వరకు, 10 ఎకరాల పైబడి పొలం కలిగిన రైతులకు 50శాతం రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మైక్రోఇరిగేషన్ ఏరియా అధికారి మహేశ్‌బాబు, ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండిలో టెంకాయల విక్రయ హక్కు కోసం టెండర్లు

చక్రాయపేట, సెప్టెంబరు 15: గండి క్షేత్రంలో టెంకాయలు విక్రయించుకునే హక్కుకోసం ఈ నెల 17వ తేదీ బుధవారం సీల్డ్‌టెండర్లు/ బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకట సుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్‌దారులు రూ.10లక్షలు డిపాజిట్ నగదుగా కానీ, డీడీ ద్వారా గానీ చెల్లించి టెండర్లలో పాల్గొనాలన్నారు. ఏడాదిపాటు టెంకాయల విక్రయించుకునేందుకు హక్కును టెండర్‌దారునికి కల్పిస్తామని తెలిపారు.

మా గోడు యూసీఐఎల్‌కు పట్టదా..!

- ఆర్డీఓ కార్యాలయం ఎదుట కేకే కొట్టాల ప్రజల ఆందోళన



ఆర్డీఓతో మాట్లాడుతున్న కేకే కొట్టాల ప్రజలు

పులివెందుల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్)కు ఎన్నేళ్లుగా మా సమస్యలను విన్నవిస్తున్నా వారికి చీమకుట్టినట్లు కూడా లేదని కేకే కొట్టాల ప్రజలు ఆరోపించారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట వారు ఆందోళనకు దిగారు. దీంతో ఆర్డీఓ చిన్నయ్య కార్యాలయంలో వారితో చర్చ లు జరిపేందుకు ఆహ్వానించారు. అప్పటికే యూసీఐఎల్‌కు సం బంధించిన పలువురు అధికారులు ఆర్డీఓతో చర్చిస్తున్నారు. అక్కడకు వెళ్లీవెళ్లగానే కెకెకొట్టాల ప్రజలు యూసీఐఎల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నేళ్ల నుంచి మా సమస్యలు మీ దృష్టికి తెస్తున్న మీకు పట్టదా.. కావాలనే మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆర్డీఓ చాంబర్‌లో ప్రజలందరు వచ్చేందుకు వీలుకాక పోవడంతో సభాభవనంలో చర్చ సాగించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు శ్రీనాథ్‌రెడ్డి కెకె కొట్టాల ప్రజల తరపున మాట్లాడారు. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి టెయిలింగ్ పాండ్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. 2017లో ఒకసారి, 2021లో మరోసారి ఇలా నాలుగేళ్లకు ఒక సారి టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు సాగిస్తున్నారన్నారు. ఈ విస్తరణ పనులు సాగిస్తున్న ప్రతిసారి కెకెకొట్టాల ప్రజలు వారి పొలాలను పూర్తిగా స్వాధీనం చేసుకొని నష్టపరిహారం చెల్లించి ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇప్పుడు మరోసారి విస్తరణపనులు చేసేందుకు యూసీఐఎల్ సిద్ధమైందన్నారు. ఈ పనులను ప్రజలు రెండు మార్లు అడ్డుకున్నారన్నారు. యూసీఐఎల్ మనుగడ ఇబ్బంది అవుతుందని, టెయిలింగ్ పాండ్ విస్తరణ సరైందేనప్పటికి ప్రజల ఇబ్బందులు కూడా గుర్తించాలని అధికారులకు వివరించారు. అందుకు యూసీఐఎల్ అధికారులు, ఆర్డీఓ మాటాడుతూ కేకే కొట్టాల రైతులు భూములను యూసీఐఎల్ తీసుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. భూములసర్వే తదితర కార్యక్రమాలు ముగించుకొని వారికి నష్టపరిహారం చెల్లించేందుకు దాదాపు రెండేళ్లలో ముగించేందుకు యూసీఐఎల్ ఒప్పుకుందన్నారు. కాబట్టి టెయిలింగ్‌పాండ్ విస్తరణకు ఆటంకం కలిగించవద్దన్నారు. ఇందుకు కేకే కొట్టాల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపించాయి. యూసీఐఎల్ ఇప్పటికి ఎన్నోమార్లు ఇలాంటి మాటలు చెప్పి తప్పించుకున్నారన్నారు. 2021 విస్తరణపనుల్లో ఇలాంటి మాటలు చెప్పి పనులు సాగించారన్నారు. 2024లో విస్తరణ పనులు అవసరమవుతాయని తెలిసి మా సమస్యలు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. దీనికి యూసీఐఎల్ ప్రతినిధులు ఇక్కడ జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామని చెప్పారు. దీంతో తమకు సరైన పరిష్కారం చూపేవరకు టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు ముందుకు సాగనివ్వమన్నారు.

సూది మందు వికటించి మున్సిపల్ ఉద్యోగి మృతి



రంగనాయకులు (ఫైల్)

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దు టూరు మున్సిపాలిటీలో వాటర్ వర్క్స్ సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగి రంగనాయకులు (54) ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల రంగనాయకులు కింద పడి చేయి దెబ్బతి నడంతో గాంధీ రోడ్డులోని ఎముకల వైద్యుని వద్ద చికిత్స కోసం చేరాడు. గాయం అయిన చేతికి వాపు తగ్గాక ఆపరేషన్ చేస్తామని వైద్యుడు తెలిపారు. మూడు రోజుల పాటు అక్కడే వైద్యం చేయించుకున్న రంగనాయకులుకు సోమ వారం ఆపరేషన్ చేయడానికి యాంటిబయోటిక్ సూది మందు పడుతుందో లేదో అని చేతికి టెస్టు డోస్ ఇచ్చా రు. అది వికటించి వెంటనే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. యాంటిబయోటిక్ ఇన్‌జెక్షన్ కేవలం టెస్టు డోస్ వేయగానే అది కార్డియాక్ అరెస్టు జరిగి ఉండవచ్చని వైద్యుడు విద్యాసాగర్‌రెడ్డి వెల్లడిస్తున్నారు. కానీ రంగనాయకులు కుటుంబసభ్యులు ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఈఈ ఎం శ్రీనివాసులు ఆసుపత్రికి వచ్చి రంగనాయ కులు మృతదేహాన్ని పరిశీలించి.. ఆసుపత్రి వైద్యున్ని విచారించారు. పోస్టుమార్టం చేస్తే తెలుస్తుందని, వైద్య సేవల్లో లోపం ఉంటే తమపై చర్యలు తీసుకోవచ్చని వైద్యుడు విద్యాసాగర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు తెలిపారు.

ఫైనాన్స్ బాకీ కట్టలేక యువకుడు ఆత్మహత్య

మైదుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ బాకీ కట్టలేక పట్టే రమేశ్ (22) అనే యువకుడు విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ ఫైనాన్స్ కంపెనీలో 2003లో తన ఇంటిని కుదవపెట్టి రూ.4లక్షల 25వేలు రుణం తీసుకున్నాడు. పాతగుడ్డల వ్యాపారం చేసుకుని జీవనం సాగించే రమేశ్ వ్యాపారం లేక ఫైనాన్స్ కట్టకపోవడంతో తన గృహం తనకు కాకుండా పోతుందేమోనని గత శుక్రవారం విషద్రావణం తాగి ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. అయితే అతని పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆ మేరకు అతని తండ్రి ఓబులేసు మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌లో దొంగతనం

వల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి స్థానిక విద్యుత్ సబ్ స్టేషనుకు సమీపంలోని హోటల్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. బాధితుల వివరాల మేరకు.. చిన్నలేబాక గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతులు చిన్న రేకుల షెడ్డు వేసుకుని హోటల్ పెట్టుకున్నారు. ఆదివారం రాత్రి హోటల్‌లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా దొంగలు షట్టరుకు వేసిన లాక్ పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాదాపు రూ.40 వేలుకు పైగా విలువ చేసే హోటల్‌లోని వస్తు సామగ్రిని తీసుకెళ్లినట్లు తెలిపారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 లోపు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి


కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిపులు పొందడానికి కళాశాల విద్యార్థులు కళాశాల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికార అధికారి కొమ్మద్ది సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమోదు చేసు కున్న విద్యార్థులు బయోమెట్రిక్ పూర్తి చేయాలని సూచించారు. సంబం ధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది వారి కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి జిల్లా సంక్షేమశాఖలకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులు తక్షణమే పంపాలన్నారు. కళాశాలలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు వారికి సంబంధించిన సచివాల యాల్లో వెరిఫికేషన్ పూర్తి చేయించుకోవాలన్నారు. కళాశాలల్లో చదువు తున్న ఎస్సీ విద్యార్థులకు ఆధార్‌తో లింకు అయిన బ్యాంకు అకౌంటుకు మాత్రమే స్కాలర్‌సిప్ జమ అవుతుందని తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ విద్యార్థులు జాయింట్ అకౌంటు వివరాలను కళాశాలలో సంబంధిత సచివాలయాల్లో ఇవ్వాలని తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైల వరం జలాశయానికి సోమవారం ఉదయం నుంచి నీరు నిలుపుదల చేసి నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు నుంచి ప్రాజెక్టులోకి వచ్చే కృష్ణాజలాలను నిలిపివేయడంతో మైలవరానికి నీరు నిలుపుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వాగులు, వంకలు, పెన్నా చిత్రావతి నదుల ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 1000 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా, గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు.

వంక నీటిలో కొట్టుకుపోయి ఎద్దులు మృతి

- బయటపడిన యజమాని, కూలీలు



ఖాజీపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఆదిరెడ్డి ఎద్దుల బండితో ఉదయం వంక దాటుకుని పోయి పని ముగించుకుని వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన భాస్కర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి తిరిగి ఎద్దుల బండిలో వస్తుండగా యజమాని మాత్రం వంకలోనీరు అధికంగా వస్తోందని చెప్పినప్పటికి బండిలోని వారు ముగ్గురు రోజు మేము వెళుతాం ఏం కాదులే అని చెప్పడంతో ఎద్దుల బండిని కదిలించాడు. అయితే వంక మధ్యలోకి రాగానే బండి ఫల్టీ కొట్టడంతో బండి కింద యజమాని పడగా మిగతా ముగ్గురు నీటిలో దూకి ఒడ్డుకు చేరుకున్నారు. యజమాని మాత్రం కంపచెట్లను పట్టుకుని ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కలవారు ఆదిరెడ్డిని కాపాడారు. అయితే వృషభరాజములు మృతి చెందడంతో రైతు లబోదిబోమంటూ కన్నీరు మున్నీరయ్యాడు. కొద్దిరోజుల క్రితమే వీటిని రూ.1.50 లక్షలు పెట్టి కొన్నానని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు కోరారు. సీఐ వంశీధర్ అక్కడకు చేరుకొని పరిశీలించారు.

జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ ఎంపికలు



ఎంపికైన సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ మైదానంలో సోమవారం ప్రతిభే కొలమానంగా జిల్లాస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా సాఫ్ట్ టెన్నిస్ కార్యదర్శి రేవంత్ ఆధ్వర్యంలో సాగిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో మహిళల విభాగంలో అభిగేల్ మోక్ష గ్రీహిత, హర్షిక, తేజస్విని, సుప్రీత, హాస్లీ, వేరోనిక, స్వర్ణజిత ఎంపికయ్యారు. అలాగే పురుషుల విభాగంలో బిలాల్, వరుణ్, మల్లిఖార్జున, నాగరాజు, మునెయ్య, రెడ్డయ్య, చంద్రశేఖర్, ఉదయ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా స్కూలు గేమ్స్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు శివశంకర్‌రెడ్డి, డీఎస్ఏ కోచ్ శ్యామ్యుల్ పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు - అనంతపురం జట్లు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడురోజులు) ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా సోమవారం చిత్తూరు, అనంతపురం జట్లు భారీ స్కోరు దిశగా ముందుకు సాగుతున్నాయి. కేఎస్ఆర్ మైదానంలో కర్నూలు - చిత్తూరు మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 89 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 375 పరుగులు చేసింది. ఇందులో భవానీ ప్రసాద్ 62 పరుగులు, నిఖిత్ గౌడ్ 110 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. అలాగే వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 364 పరుగుల భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఇందులో మహేంద్రరెడ్డి 142 పరుగులతో, వికాస్ 85 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

ఉల్లాసంగా సాగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగర డీఎస్ఏ మైదానంలో సెపక్‌తక్రా, రెజ్లింగ్, నెట్ బాల్ క్రీడలు నిర్వహించారు. ఇందులో 14, 17 సంవత్సరాల విభాగాల్లో ఎంపికలు జరిగాయి. ఉమ్మడి కడప జిల్లా నుంచి సుమారు 350 మంది క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో దాదాపు 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

వల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన ఎస్‌జీఎఫ్-19 సెలక్షన్ పోటీల్లో మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల చెందిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు. జూడో విభాగంలో మణికంట, రెజ్లింగ్‌లో ఎన్.విశ్వనాథరెడ్డిలు ఎంపికైనట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు ఉపశమనం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఉపశమనం కలిగిస్తుందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు ఆపరేషన్లు చేయించుకుని డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతోందన్నారు. చెన్నంశెట్టి వెంకటహేమంత్‌కు రూ. 30 వేలు, పంద్రా నరసింహులుకు రూ. 48,942, మండల అహల్య కు రూ. 20,524, డబ్బీ వెంకటలక్ష్మీ కి రూ. 58,770, హస్తి సుబ్బరామరాజు కు రూ. 40,226, నారికే చిలకమ్మకు రూ. 25,541, చన్నుమూరి అరుణకు రూ. 23,400, మధు సుబ్బరామయ్యకు రూ. 1,33,404, బండారు శివమ్మకు రూ. 23,920, నిమ్మల రెడ్డెమ్మకు రూ. 92,650, లింగట్ల హేమేంద్రకు రూ. 25 వేలు, తురక కుమారస్వామికి రూ. 44,478, ముక్కి సుజాతకు రూ. 32.255 లను చెక్కుల రూపం లో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జి పఠాన్ మౌలా, పోకల మణి, ఉంగరాల చిన్నా తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ఝరికోన కాలువ పనుల ప్రారంభానికి చర్యలు ● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో రాజంపేట నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చమర్తి జగన్‌మోహన్ రాజు హామీ ఇచ్చారు. సోమవారం మం డల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన భూ కబ్జాలపై చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. గత ఎమ్మె ల్యే ప్రస్తుత రాజంపేట ఎమ్మెల్యే కను ‍ సన్నల్లోనే భూకబ్జాలు జరిగాయన్నారు. సుండు ఎల్లె మండలంలోని సమస్యలను రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మామిడి రైతుల సంక్షేమానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. సుండుపల్లె, రాయచోటి డబుల్ రోడ్డు పనులను తొందరలో పూర్తి చేసి ప్రభుత్వం ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబునాయుడు, సీనియర్ నాయకుడు శివకుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మునిగిపోతున్న పైర్లను కాపాడాలి

పెనగలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టు వెనుకజలాల్లో మునిగి పోతున్న తమ పంటలను కాపాడాలని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని కోరినట్లు సిరిపురం గ్రామ ప్రజలు సోమవారం తెలిపారు. ప్రతి ఏడాది సెప్టెంబరు నుంచి మార్చి వరకు సోమశిల ప్రాజెక్టు వెనుకజలాలు తమ గ్రామ పరిధిలోని సుమారు వంద ఎకరాల్లో 5 నుంచి 7 అడుగుల ఎత్తు నిలుస్తుండడంతో ఆ భూముల్లో సుమారు ఏడు నెలలపాటు ఎలాంటి పైరు సాగు చేసుకోవడానికి వీలుపడదన్నారు. ప్రభుత్వం మునుగుతున్న తమ పొలాలకు నష్టపరిహారం కూడా చెల్లించలేదన్నారు. దీంతో రూపానందరెడ్డి సోమశిల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌తో ఫోన్లో మాట్లాడి ప్రాజెక్టు వెనుకజలాలను తగ్గించి ఇక్కడి రైతుల పంటలు కాపాడాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ప్రజలు తెలిపారు.



ముక్కా రూపానందరెడ్డికి సమస్యను వివరిస్తున్న సిరివరం గ్రామ ప్రజలు

వినాయకుడి గుడికి రూ.1.50 లక్షలు విరాళం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేటలో నిర్మిస్తున్న వరసిద్ధి వినాయకాలయానికి పార్లమెంట్ మాజీ సభ్యుడు గునిపాటి రామయ్య కుమారుడు గునిపాటి కిరణ్‌కుమార్ రూ.1.50 లక్షలు విరాళాన్ని అందజేశారు. మం గంపేట గ్రామ పంచాయతిలోని ఆర్‌ఆర్-1 సెంటర్ మూడో వీధిలో ఇందుకు సంబంధించిన పనులకు సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు గ్రామ ప్రజల సమక్షంలో చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగంపేట టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోకూరి సుబ్రమణ్యం, ఈశ్వరయ్య, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న కిరణ్‌కుమార్

ఉత్తమ ఉపాధ్యాయుడుగా రవి

పుల్లంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎయిడెడ్ స్కూల్ అసోసియేషన్ రాయలసీమ స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడి పురస్కారాన్ని పుల్లంపేటలోని శ్రీ శివపార్వతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.రవి అందుకున్నారు. సోమవారం తిరుపతిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎమ్మెల్సీ టీచర్ రామచంద్రారెడ్డి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కె.రవిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, అపుస్మ రాష్ట్ర అధ్యక్షులు తులసి, విష్ణుప్రసాద్, శివపార్వతి విద్యా సంస్థల కరస్పాండెంట్ సోము బాలాజీబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో ఘనంగా ఇంజనీర్స్ డే

రాజంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, విజ్ఞానాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ప్రతిభ కనబరచిన అధ్యాపకులకు, విభాగాధిపతులు డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ సి.మదన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్.శారదలకు అవార్డులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక మోడల్స్ ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ ఎన్.రామసుబ్బారెడ్డి, డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ పీవీ సంజీకుమార్, యూనివర్సిటీ డీన్‌లు, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి తవ్వితే కఠినచర్యలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా అక్రమంగా చెరువులు, కుంటల్లో మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు యామిని, ఆర్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. అక్రమంగా మట్టి తరలింపునకు సహకరించిన వారితోపాటు, ఆయా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇలాంటి అక్రమ కార్యక్రమాలపై అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

‘గాలికుంటు’ నివారణకు టీకాలు తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రబలే అవకాశాలున్నాయని, వీటి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పందిళ్లపల్లె పశువైద్యాధికారి మహేశ్ సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా చేపడుతున్న గాలికుంటు వ్యాధి నివారణకు ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు ప్రతి పశువుకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం నోటి నుండి నురగ రావటం వంటి లక్షణాలుంటాయన్నారు. పాడిపశువుల్లో ఈ వ్యాధి నివారిస్తే పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందన్నారు. పశువులను ప్రతి రైతు నట్టల నివారణ మందులు తప్పక వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సిబ్బంది సైదులు పాల్గొన్నారు.

సుండుపల్లె: సుండుపల్లె మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె, ముడుంపాడు, మడతాడు, భాగంపల్లి గ్రామ పంచాయతీల్లో సుమారు 400 ఆవులకు, 68 గేదెలకు టీకాలు వేసినట్లు డాక్టర్ మాలకొండయ్య తెలిపారు. పశుసంవర్ధకశాఖ సహాయకులు విజయ్‌కుమార్, డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని కొటారుపల్లె, కట్టవారిపల్లెల్లో సోమవారం 156 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి ఎన్.సురేష్‌బాబు తెలిపారు. గుండ్లవారిపల్లెలో 51, తంగర్లవారిపల్లెలో 53, ఓదేటివారిపల్లెలో 52 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. సిబ్బంది బసవరాజు, పెంచలయ్య, లక్ష్మయ్య, క్రిష్ణవేణి, వెంకటరాజు, అజార్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : స్థానిక నూనెవారిపల్లె రోడ్డు, ములక్కాయలపల్లె గ్రామంలో సోమవారం డాక్టర్ విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో 284 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా రాజంపేట సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ గాలికుంటు వ్యాధి టీకాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టీడీపీ పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు కె.అనసూయమ్మ, చెర్లోపల్లె పశువైద్యాధికారి డాక్టర్ కె.భాగ్యవతి, జేవీవో ఎం.వరదయ్య, ఎల్ఎస్ఏ మణి, ఏహెచ్ఏ ప్రియాంకా, రాజేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి మహేశ్

టమోటా, బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించండి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టమోటా, బొప్పాయి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్, కిసాన్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా టమోటా, బొప్పాయి పంటలు సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని చెప్పారు. మార్కెట్లలో దళారీ వ్యవస్థ కారణంగా సరైన ధర లభించడం లేదన్నారు. ప్రభుత్వం తోతాపురి మామిడి రకానికి 4 రూపాయలు సబ్సిడీ ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు రైతులకు అందలేదని ఆరోపించారు. గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు ఆత్మహత్యల వరకు వెళ్లే పరిస్థితి తలెత్తుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



డీఆర్‌వోకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

జెట్టివారిపల్లె పాఠశాలకు వాటర్‌ఫిల్టర్ వితరణ

పెనగలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జెట్టివారిపల్లె ఎలిమెంటజూరీ పాఠశాలకు ఎగువరాచపల్లెకు చెందిన ఈజారి వెంకటసుబ్బయ్య, పద్మావతమ్మ దంపతులు తమ కుమారుడు పవన్‌కుమార్ జ్ఞాపకార్థంగా వాటర్ ఫిల్టర్ అందజేశారు. దాతలను హెడ్ టీచర్ వినోద్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు సునీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కస్తూర్బా విద్యాలయంలో రసాయన శాస్త్రాన్ని బోధించేందుకు పార్ట్‌టైం అధ్యాపకులు అవసరమని ప్రిన్సిపాల్ రాజకుమారి తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్హత ఉన్నవారు ఈ పోస్టుకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థికి రూ. 12 వేలు గౌరవ వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సంప్రదించాలని ప్రినిపాల్ ఒక ప్రకటనలో కోరారు.

సోమశిల ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సోమశిల వెనక జలాల పరివాహక ప్రాంతాల్లో నివ సిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహ సీల్దారు దామోదర్‌రెడ్డి తెలియజేశారు. సోమవారం మండలంలోని పెన్నపేరూరు, తప్పెటవారిపల్లె గ్రామాల్లో వెనుక జలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి మట్టం పెరిగితే తమకు తెలియజేయాలన్నారు. పరిస్థితిని బట్టి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రివేళల్లో రైతులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు బయటకు రావద్దన్నారు. ఏ పనులు ఉన్నా పగలు మాత్రమే చూసుకోవాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడ నరసింహారెడ్డి, వీఆర్వో అంజి పాల్గొన్నారు.

కోడిని మింగిన కొండచిలువ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారి పల్లెలో ఆదివారం రాత్రి కొండ చిలువ కోడిని మింగేసింది. సోమవారం ఉదయం విషయం గమనించిన గ్రామస్తులు కొండ చిలువను పట్టుకుని అడవి సమీపంలో వదిలేశారు. కొండచిలువ కోడిని మింగకుండా ఇళ్లల్లోకి ప్రవేశించి ఉంటే ఇబ్బందులు పడేవారమని స్థానికులు తెలి పారు. కొండచిలువ సుమారు 8 అడుగులు ఉందన్నారు.

రోడ్డు ఆక్రమణపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణానగర్ సర్వే నంబరు 640లో దశాబ్దాలుగా ఉన్న రోడ్డును కొందరు ఆక్రమించి తమకు దారి లేకుండా చేస్తున్నారంటూ స్థానికులు సోమవారం పీజీఆర్ఎస్‌లో రాజంపేట సబ్‌కలెక్టర్ భావనకు ఫిర్యాదు చేశారు. 2011లో రాజంపేట ఆర్డీవో, తహసీల్దారు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాజంపేట సర్వే చేసి ఇచ్చిన నివేదికను కూడా సబ్‌కలెక్టర్‌కు చూపించారు. వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ తక్షణమే విచారించి తగిన చర్యలు తీసుకోవాలని రాజంపేట తహసీల్దారును ఆదేశించారు. 640 సర్వేనంబరు సర్వే చేసి చూపిస్తామని భవిష్యత్‌లో సమస్యలు లేకుండా చేస్తామని కృష్ణానగర్ వాసులకు తహసీల్దార్ హామీ ఇచ్చారు. మరోవైపు ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణానగర్‌లో ఉన్న చెట్లను నరికి వేయడంపై ఫారెస్ట్ అధికారులు స్పందించి, అక్కడ పనిచేస్తున్న యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.



తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ భావన

నిరుపయోగంగా.. వంద పడకల ఆసుపత్రి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో 100 పడకల ఆసుపత్రి నిర్మించారేగాని ఎలాంటి ఆధునిక వైద్యం ప్రజలకు అందడంలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మహేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి సికిందర్ విమర్శించారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన అనంతరం వారు ఆసుపత్రి సూపరింటెడెంట్ డాక్టర్ నాగేశ్వరరావురాజుతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాద కేసులు, ఇతర అత్యవసర రోగులను తిరుపతి, కడపకు తరలిస్తున్న విషయాన్నిప్రస్తావించారు. ఆసుపత్రిలో తగిన సంఖ్యలో వైద్యులు, సిబ్బంది లేకపోగా , కంటి, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్ వంటి కీలక విభాగాల్లో కూడా వైద్యులు లేకపోవడంతో ఆ విభాగాల్లో చికిత్స లు ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, రమణ, పెంచలయ్య, సీపీఎం నాయకులు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో సమావేశమైన వామపక్ష నేతలు

హిందీ భాష అందరూ నేర్చుకోవాలి

నందలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం ఆమోదించిన భాషల్లోకెల్లా హిందీ అత్యుత్తమైన భాష కాబట్టి దీనిని రాజభాష, జాతీయ భాషగా ఎన్నుకున్నారని, కాబట్టి మనమంతా జాతీయ భాషను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల విద్యాశాఖాధికారి అనంతకృష్ణ తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాటూరులో హిందీ ఉపాధ్యాయుడు షఫిఉల్లా ఆధ్వర్యంలో సోమవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం వల్ల భారతదేశంలోనేగాక ఇతర దేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిం చిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, స్పీడ్ రీడింగ్, చిత్రలేఖన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ స్థానాల్లో విజేతలకు బహుమతులను అందజేయడం జరిగింది.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని రైతు బజార్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా . రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా పండే కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ఇవి తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రకృతి కూరగాయల సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలను అందజేస్తుందని చెప్పారు. ప్రతి కుటుంబం ప్రకృతి ఉత్పత్తులను ప్రధానంగా వినియోగించుకోవాలని, దీని ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య రక్షణ కూడా సాధ్యమవుతుందని సూచించారు. స్థానికంగా పండిన ప్రకృతి ఉత్పత్తులను ప్రజలకు సులభతరంగా అందుబాటులోకి తేవడమే ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయ చోటి ఏడీ త్యాగరాజు, సిబ్బంది పవన్, పద్మావతి, రవీంద్రలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న డీపీఎం వెంకటమోహన్

6, 7, 8 తేదీల్లో క్రీడా పోటీలు

రామాపురం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు అక్టోబరు నెల 6, 7, 8 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణుడు, జయచంద్రుడు తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో 14 ఏళ్ల లోపు బాలబాలికలు, 17 ఏళ్ల లోపు బాలబాలికలకు రెండు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల కోఆర్డినేటర్ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీ మోడల్ స్కూల్, ఏపీ రెసిడెన్సియల్ స్కూల్‌లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ యోగా విభాగాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, సురేంద్రాజ్, విజయవాణి, ప్రతాప్, జాహిద్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు


రామాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈ నెల 17 బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బందికి, ఆశ వర్కర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వైద్య సేవలు, పోషకాహారాన్ని అందించడంతోపాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ దివ్యశ్రీ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరును పెండింగ్‌లో పెడితే చర్యలు తీసుకుంటామని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ వీఆర్వోలను హెచ్చరించారు. సోమవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్‌వోలు సమయాన్ని వృథా చేస్తున్నారే తప్ప, సమస్యలు పరిష్కారం చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇచ్చింది ప్రజలకు సేవ చేయడానికి అని గుర్తు చేశారు. సకాలంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుకృషి చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, డీఈ జయప్రసాద్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్



చెక్కముక్కలైన కళ

- నాడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- నేడు ఆదరణలేక.. కూలీలుగా కళాకారులు
- చతికిలపడ్డ శెట్టిగుంట చెక్కబొమ్మల వ్యాపారం
- 20 కుటుంబాలకు.. మిగిలింది ఒక్క కుటుంబమే




శెట్టిగుంట కళాకారుల చేతిలో చెక్కతో రూపుదిద్దుకున్న బొమ్మలు



అంతర్జాతీయ స్థాయిలో శెట్టిగుంట చెక్కబొమ్మలకు పేరు గాంచింది. గతంలో అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌కు కూడా శెట్టిగుంట చెక్కబొమ్మలను ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బిల్‌క్లింటన్‌కు శెట్టిగుంట చెక్కబొమ్మను అందజేశారు. ఆయన వీరి పనితనం చూసి ముగ్ధులయ్యారు. చెక్కబొమ్మలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి మంచి ఆదరణ కల్పిస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. హైదరాబాదులో ఒక స్టాల్ కూడా ఏర్పాటు చేయించారు. బొమ్మలు విపరీతంగా అమ్ముడుపోయాయి. అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చింది. కళాకారులకు చేతి నిండా పని, డబ్బులు ఉండేవి. కాల క్రమేణా చెక్కబొమ్మలకు ఆదరణ తగ్గి మార్కెటింగ్ లేక కళాకారులు ఇక్కట్లకు గురయ్యారు. వివిధ రకాల చేతివృత్తులు, కూలి పనులతో పొట్టపోసుకుంటున్నారు. 20 కుటుంబాలకుగాను ఒక్క కుటుంబం మాత్రమే శెట్టిగుంటలో మిగిలింది. మిగిలిన కళాకారులు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు.

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలోని పంచాయతీ కేంద్రమైన శెట్టిగుంటలో చెక్కబొమ్మలు తయారు చేసే కుటుంబాలు 20 ఉన్నాయి. సుమారు 100 సంవత్సరాల నుంచి ఇదే వృత్తిగా వీరు జీవనం సాగిస్తున్నారు. రానురాను ఈ బొమ్మలకు డిమాండ్ ఏర్పడింది. 20 కుటుంబాల్లో సుమారు 40 మంది కళాకారులు ఉండేవారు. శెట్టిగుంట ప్రాంతంలో లభించే టేకు, ఎర్రచందనం కొయ్యలను సేకరించి బొమ్మలు తయారుచేసి అమ్ముకుని వచ్చేవారు. మొదట తిరుపతి, హైదరాబాద్ తర్వాత తమిళనాడు, కేరళ తదితర ప్రాంతాల్లో బొమ్మల అమ్మకాలు చేపట్టారు. డిమాండ్ పెరగడంతో బొమ్మల తయారీని వేగంగా చేసేవారు.

కొయ్యలకు అనుమతి లేక..

శెట్టిగుంట కళాకారుల చేతుల్లో రకరకాల దేవతామూర్తులు రూపు దిద్దుకుంటున్నారు. కొయ్యతో వినాయకుడు, వెంకటేశ్వరుడు, లక్ష్మీదేవి, కృష్ణుడు, బుద్ధుడు, అన్నమయ్య, సీతారాములు, పల్లెపడుచు.. ఇలా రకరకాల బొమ్మలను తయారు చేసేవారు. ఈ బొమ్మలతోనే శెట్టిగుంట పేరు ప్రసిద్ధిగాంచింది. అయితే అడవిలో లభించే కొయ్యలు తెచ్చుకోవడానికి అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వలేదు. కళాకారులు డిమాండ్ చేయడంతో గతంలో కొంతవరకు అనుమతి ఇచ్చారు. తర్వాత ఎర్రచందనం కొయ్యలు ఇవ్వడం ఆగిపోయింది. అటవీశాఖ నుంచి అనుమతి ఇప్పించి ఆదుకోవాలని కళాకారులు ఎందరో ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసినా ప్రయోజనం శూన్యం. దీంతో కొయ్య కొరత ఏర్పడింది.

రూ.2వేల నుంచి రూ.15వేలు

అడవుల్లోని కొయ్యను తెచ్చుకోవడానికి అనుమతులు రాకపోవడంతో వ్యవసాయ రైతుల తోటల్లో ఉన్న కొయ్యలను కొనుగోలు చేసి బొమ్మలు తయారు చేశారు. ఒక్క అడుగు బొమ్మను 2 నుంచి 3 రోజుల్లో తయారు చేసేవారు. 2 నుంచి 5 అడుగుల బొమ్మలను సుమారు పది రోజుల్లో తయారు చేసేవారు. దేవుడి బొమ్మలు అసలు దేవుడే దిగి వచ్చాడన్నంత అందంగా తీర్చిదిద్దేవాళ్లు. ఒక్క అడుగు బొమ్మను రూ.2వేలు, రెండు అడుగుల బొమ్మను రూ.3 వేలు, ఐదు అడుగుల బొమ్మను రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్మకాలు చేసే వారు. బొమ్మను బట్టి డిమాండ్ ఉండేది.

కొయ్య, మార్కెటింగ్ లేక..

రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో కళాకారులకు శెట్టిగుంటలో ఒక కమ్యూనిటీ హాలును నిర్మించారు. అందులో చెక్కబొమ్మల తయారీ చేపట్టారు. హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా బొమ్మల విక్రయాలను కొంత కాలం సాగించారు. రాను, రాను ఈ బొమ్మలకు కొయ్యలు లభించకపోవడం, తగిన మార్కెటింగ్ లేకపోవడంతో బొమ్మల తయారీ తగ్గిపోయింది. దీంతో కళాకారులకు జీవనోపాధి పూర్తిగా లేకుండా తగ్గిపోయింది. ఉన్న స్టాల్స్‌ను కూడా ఎత్తివేశారు. 19 కుటుంబాల వారు నాయుడుపేట, తిరుపతి, రైల్వేకోడూరు తదితర ప్రాంతాలకు వెళ్లి చేతివృత్తులు, కొందరు కూలిపనులు, మరికొందరు గల్ఫ్‌దేశాలకు వెళ్లి చాలీచాలని జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అయినా తమను ఆదుకుంటే వలస వెళ్లిన కుటుంబాలు మళ్లీ శెట్టిగుంటకు వస్తాయని, తిరిగి చెక్కబొమ్మల వైభవాన్ని తీసుకుని వస్తామని కళాకారులు అంటున్నారు.


మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



చెక్కబొమ్మలకు గతంలో డిమాండ్ ఉండేది. మార్కెటింగ్ లేకపోవడంతో ప్రస్తుతం డీలా పడిపోయింది. పూర్తిగా అమ్మకాలు లేక బొమ్మలు మూలనపడి ఉన్నాయి. 20 కుటుంబాలకు ఒక్క కుటుంబం మాత్రమే ఆర్డర్‌ను బట్టి కొన్ని బొమ్మలను తయారు చేసి విక్రయిస్తున్నారు. అది కూడా ఎప్పుడో ఆర్డర్ వస్తుంది. కూటమి ప్రభుత్వం అయినా శెట్టిగుంట చెక్కబొమ్మలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.

– సాలాపక్షి చంద్రశేఖర్, చెక్కబొమ్మల వ్యాపారి, శెట్టిగుంట

ఎర్రచందనం కొయ్యలు ఇవ్వాలి



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం కొయ్యలకు ధర నిర్ణయించి మాకు ఇస్తే బొమ్మలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాము. కొయ్య లేక పనులు చేసేందుకు వీలుకావడం లేదు. చేసిన బొమ్మలు అమ్ముడు పోవడం లేదు. కొయ్యలేక, బొమ్మలకు గిరాకీ లేక చాలా మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. చాలీచాలని కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. శెట్టిగుంట చెక్కబొమ్మల కళాకారులను ఆదుకోవడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

– సాలాపక్షి మునెయ్య, కళాకారుడు, శెట్టిగుంట

ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయరాదు : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెస్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి నిర్వ హించారు. ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను నేరుగా విని ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు తదితర సమస్యలపై ఎస్పీ స్వయంగా విచారణ జరిపారు. అనంతరం ఎస్పీ ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించాలని, ఆలస్యం చేయరాదని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు.

మార్కెట్ కమిటీ సభ్యుల నియామకం

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా దోబూచులాడుతున్న మదనపల్లె మార్కెట్ కమిటీ సభ్యుల నియామకంపై సీఎం పేషీ జోక్యంతో ఎట్టకేలకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ప్రభుత్వానికి అధిక ఆదాయం ఒనగూర్చే మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీకి జూలై 16న మదనపల్లె జనసేన నేత జంగాల శివరామ్‌ను నియ మిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ పదవిపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో తమ బాధను వెళ్లగక్కారు. అప్పటి నుంచి రెండు నెలలుగా మదనపల్లె మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు, సభ్యుల నియామకం పెండింగ్‌లో పడి పోయింది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు పేషి ఈ విష యంలో జోక్యం చేసుకోవడంతో సీఎం కార్యదర్శి ఏవీ రాజమౌళి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17న ఈ మేరకు జీవో విడుదల చేయాలని ముక్తాయించారు.

సీఎం పేషి నుంచి వచ్చిన జాబితా ప్రకారం

మదనపల్లె మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా జంగాల శివరామ్, ఉపాధ్యక్షుడిగా ఆర్.ఆంజినేయులు, సభ్యులుగా ఎం.రమణమ్మ, ఆర్.సుబ్రమణ్యంరెడ్డి, బి.ప్రమీల, సి.నరసింహులు, పులి మహాలక్ష్మి, బి.మున్నా నాయక్, ఇ.రెడ్డిశేఖర, బి.మణి, పి.వాణి, బి.శ్యామలమ్మ, బి.సంధ్యారాణి, జి.లక్ష్మీపతి, ఆర్.అరుణలను నియమించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

మోటారు క్యాబ్, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

రాయచోటి కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటో రిక్షా, మోటారు క్యాబ్ తదితర వాహనాల డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. వాహనాలకు ఏపీలో రిజిస్ట్రేషన్ కలిగి ఉండడంతో పాటు, డ్రైవరుకు లైసెన్సు, ఫిజికల్ ఫిట్నెస్, బీపీఎల్ రేషన్‌కార్డు కలిగి ఉండాలి. దరఖాస్తుదారు కుటుంబ సభ్యుల్లో పెన్షనర్లుగానీ, ప్రభుత్వ ఉద్యోగులు కానీ ఉండరాదు.. గృహంలో విద్యుత్ వినియోగం 300 యూనిట్లు కంటే తక్కువగా ఉండాలి. వాహనంపైన రుణ బకాయిలు ఉండరాదు. వాహనదారుడికి మూడు ఎకరాల కన్నా ఎక్కువ మాగాణి గానీ, మెట్ట అయితే 10 ఎకరాలకు పైగా ఉండరాదు. పట్టణ ప్రాంతాల్లో కమర్షియల్ భవనం, గృహాలు 1000 గజాలకు మించకుండా ఉండాలి. పై అర్హతలు కలిగిన క్యాబ్ లేక ఆటో డ్రైవర్లు సచివాలయంలో ఈ నెల 19వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నమయ్య జిల్లా రవాణాశాఖ అధికారి కె.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

దామరచర్లలో భారీ భూ కబ్జా

- రెండు రోజుల సెలవులతో ఆక్రమణకు యత్నం
- రెవెన్యూ సిబ్బందికి రూ.లక్షల్లో ముడుపులు ?



దామరచర్ల పరిధిలో అక్రమార్కులు చదును చేసిన బంజరు భూములు

పెనగలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని దామరచర్లలో రెండు రోజులుగా భారీ భూ కబ్జా జరిగినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు 50 ఎకరాల పైబడి బంజరు భూములను స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతోనే చదును చేసినట్లు సమాచారం. ఇందుకు నెల రోజుల నుంచి పన్నాగం వేయగా, ఈ నెల రెండో శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో తమ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని స్థానిక అధికారులు భరోసా ఇవ్వడంతోనే కబ్జాదారులు రెచ్చిపోయినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సుమారు పదేళ్లుగా ఈ గ్రామ పరిధిలో ఆగిపోయిన భూకబ్జాలు ఇటీవల రెండు, మూడు నెలల నుంచి మండలంలో మళ్లీ ఊపందుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా 2018 నుంచి దామరచర్ల పరిధిలో గల భూములకు ఎటువంటి కోర్టు ఆదేశాలు లేవని, 10 రోజుల కిందట ఇద్దరు వ్యక్తులు అనధికారికంగా బోరు వేసుకుని కరెంటు తీసేందుకు స్తంభాలు కూడా నాటినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఏకంగా డోజర్లు, జేసీబీ యంత్రాలు పెట్టి బంజరు భూముల చదునుకు శ్రీకారం చుట్టారు. ఉన్నతాధికారులు స్పందించి పెనగలూరు రెవెన్యూ సిబ్బందిని కట్టడి చేయకపోతే మండలంలో అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేసేందుకు ఎక్కడా సెంటు భూమి కూడా మిగలదని ప్రజలు భావిస్తున్నారు.

ఈ విషయంపై పెనగలూరు తహసీల్దారు డి.అమరేశ్వరిని వివరణ కోరగా దామరచర్ల పరిధిలో 2018 నుంచి ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన భూములు కోర్టు పెండింగ్‌లో ఉన్నాయని, ఇటీవల 10 రోజుల కిందట ఆదేశాలు రావడంతో ఇద్దరు వ్యక్తులు చదును చేసినట్లు తెలిపారు.

రుషివాటిక ఘటనపై కేసు నమోదు

- ఉద్దేశ్యపూర్వకంగానే దాడి చేశారని ఫిర్యాదు

బి.కొత్తకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని రుషివాటిక ఆశ్రమ పాఠశాలలో ఇటీవల జరిగిన అవాంఛనీయ ఘటన పై కేసు నమోదైంది. ఈ పాఠశాలలో చదువుతున్న శేషాద్రిరెడ్డి అనే బాలుడిపై దాడి జరిగింది. దీంతో కంటికి తీవ్రగాయమై కనుచూపు రావడం అసాధ్యమని వైద్యులు తెలిపిన నేపథ్యంలో బాలుడి తండ్రి లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన అమరనాథరెడ్డి బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రుషివాటిక పాఠశాల సిబ్బందిలో ఒకరైన వెంకటేశ్ ఉద్దేశ్యపూర్వకంగా రాయితో కొట్టడంతో కంటికి తీవ్రగాయమై కనుచూపు పోయిందన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే తమ బిడ్డ కన్ను పోయిందని యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ బిడ్డ కనుచూపు కోల్పోవడానికి కారకులు కావడమే కాకుండా తిరిగి తమపై పాఠశాల యాజమాన్యం బయటివ్యక్తులను రప్పించి భయపెట్టాలని చూస్తోందన్నారు. మదనపల్లెకు చెందిన ఓ బీజేపీ నాయకుడు రుషి వాటికలో తమ బిడ్డపై జరిగిన దాడి విషయమై తప్పుడు సమాచారంతో పత్రికలు, పోలీసులను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని వాపోయారు. తాము వారితో దురుసుగా ప్రవర్తించామని, డబ్బులు డిమాండ్ చేశామని చెప్పడంలో నిజం లేదన్నారు. తమ బిడ్డకు ఎలా న్యాయం చేస్తారో మాత్రమే చెప్పాలని అడిగామన్నారు. తమ కుమారుడు పూర్తిగా కంటిచూపే కోల్పోతే కన్నుకు గాయమైందని, గీసుకుందని ప్రకటన చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ చేసి తమకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయమై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ భాస్కరనాయక్ పేర్కొన్నారు.

తగు జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల నివారణ

– జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

గాలివీడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని జిల్లా మలేరియా అధికారి ఆర్. రామచంద్రారెడ్డి, నూలివీడు పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేతారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని చీమలచెరువుపల్లి పంచాయతీ కొప్పలవాండ్లపల్లెలో వారు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి రక్త నమూనాలను సేకరించి కడప రిమ్స్‌కు, మైక్రో బయాలజీ డిపార్టుమెంట్‌కు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం చికున్‌గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు సోకుతున్నాయని, వీటి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలోని లార్వా ఉన్న నీటిని ఆశ వర్కర్లతో తొలగించి అబేట్ పిచికారీ చేయించినట్లు తెలిపారు. రక్త నమూనాల ఫలితాలను బట్టి మరోసారి గ్రామాన్ని సందర్శించి తగిన వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్, ల్యాబ్ టెక్నీషియన్లు మధుసూదన్, శివశంకర్, ఏఎన్ఎం సుహాసిని, ఆశవర్కర్లు రమణమ్మ, శిరీష, శోభారాణి, ఎల్‌హెచ్‌పీ రెడ్డిసాయిచందన, వైద్య సిబ్బంది బాబా తదితరులు పాల్గొన్నారు.



కొప్పులవాండ్లపల్లెలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ పశు వ్యాధి నివారణ పథకంలో భాగంగా పశు వైద్యులు ఇంటి వద్దకే వచ్చి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పిలుపునిచ్చారు సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంపై గోడ పత్రికను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని తద్వారా ఆర్థిక అభివృద్ధిని సాధించవచ్చన్నారు. అన్నమయ్య జిల్లాలో సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

రాయచోటి-నేతాజీసర్కిల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాటిమాయకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఎస్.అజ్మిత్ అలీ టేబుల్ టెన్నిస్ క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు సోమవారం తెలిపారు. ఈ నెల 12న కడప డీఎస్ఏ స్టేడియంలో జరిగిన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల పీడీ రమేశ్‌నాయక్, విద్యార్థి అజ్మిత్‌అలీ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు.

పెనగలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అండర్-19 టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు పెనగలూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సహజబ్లెస్సీ, ఎస్సీ పీడీ సుబ్రహ్మణ్యం, కోచ్ ఎస్.గౌస్‌మొహిద్దీన్ తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జిక్లబ్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పెనగలూరు ఆదర్శ పాఠశాలకు చెందిన సయ్యద్ తౌఫిన్, మహేందర్, సాయిసందీప్, సుధీర్ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి



మృతి చెందిన బాలిక

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీలో అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు రాయచోటి మండల పరిధిలోని యండపల్లి ఎగువ కొత్తపల్లికి చెందిన రేకులకుంట మల్లికార్జున, అంజలి కొన్నేళ్లుగా రాయచోటిలో నివాసం ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. వీరి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కొత్తపేట రామపురంలోని జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. వీరిలో పెద్ద కూతురు లావణ్య (13). సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

కలకడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 10న ముడియంవారిపల్లె కొత్తపల్లెకు చెందిన ప్రవీణ్, అతని తండ్రి వెంకటరమణ, తల్లి సుబ్బమ్మపై అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి అతని అనుచరులు కొడవలితో దాడి చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితులైన ప్రసాద్‌రెడ్డితో పాటు గంగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పుష్పావతిలను కోన క్రాస్‌లో అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హరిబాబు, కరుణాకర్, విజయ్‌కమాల్ పాల్గొన్నారు.

మహిళా దొంగల ముఠా అరెస్టు

గోరంట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంకుల వద్ద రెక్కీ నిర్వహించడం, పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి ఆ సొమ్ము కాజేయడం మొదలెట్టారు. అలా.. 14 రోజుల వ్యవధిలో వేర్వేరు రాష్ట్రాల్లో ఏకంగా 10 చోరీలు చేశారు. అందుకోసం రెండు కార్లను తీసుకుని, ఇద్దరు డ్రైవర్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఆఖరుకు ఆ మహిళా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా ఆట కట్టించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గర్ జిల్లా కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన దీప్ మాలాబాయి, పరిత సిసోడియా, రేఖా బాయి, మమత, మాలాబాయి, కారు డ్రైవర్ ప్రదీప్ సిసోడియా పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప.. దొంగల ముఠా అరెస్టు వివరాలను సోమవారం వెల్లడించారు. కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రెండు కార్లను తీసుకుని, చోరీలు మొదలెట్టారు. ఈనెల 3న గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్టేట్ బ్యాంకు(గోరంట్ల శాఖ)లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేసుకుని,



పట్టుబడిన కారు, నగదుతో డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్, సిబ్బంది

ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు. మధ్యలో ఓ దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆయనను బ్యాంకు వద్ద నుంచే రెండు కార్లలో మహిళా ముఠా వెంబడించింది. దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ద్విచక్రవాహనంలోని రూ.3.80 లక్షల నగదును చోరీ చేశాయి. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. దీప్ మాలాబాయి, పరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, మరో ఇద్దరు మహిళలు, ప్రదీప్, మరో కారు డ్రైవర్ ముఠా చోరీ చేసినట్లు గుర్తించారు. గోరంట్ల మండలంలో జాతీయర రహదారి పక్కనే కె హోటల్ వద్ద ఆదివారం ఐదు గురు మహిళలు, కారు డ్రైవర్ ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వరుస చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈనెల 3వ తేదీ మధ్య ఏకంగా పది చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. కడప జిల్లా పులివెం దుల, జమ్మలమడుగులో మూడు, తెలంగాణలో మూడు, నంద్యాల జిల్లా, కర్ణాటక, ఒడిశాలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున మొత్తం పది చోరీలు చేసి, రూ.12.59 లక్షలు అపహరించారు. వారి నుంచి మొత్తం 7.50 లక్షలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు.. కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య పేర్లను రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో చొరవ చూపిన కానిస్టేబుళ్లు వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, హోంగార్డు ప్రియాంకకు నగదు బహుమతులను డీఎస్పీ అందజేశారు. ముఠాలో మరో ఇద్దరు మహిళలు, డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజాసమస్యలపై అలసత్వం వహించవద్దని... తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కడప సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, ఇతర ప్రత్యేక విభాగాల అధి కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే పోలీసు అధికారులపై చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్య కలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారితో వ్యక్తిగతంగా ఇంటరాక్ట్ అవుతామన్నారు. హోంగార్డు స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు తనను ఎప్పుడైనా కలవచ్చని తెలిపా రు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ (ఏ ఆర్) రమణయ్య, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, కడప సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, ప్రత్యేక విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కడప రిమ్స్ పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



కడప వైద్యకళాశాల పీజీ వైద్య విద్యార్థినులు డాక్టర్ వీజే అర్ష, డాక్టర్ బి.సుధేష్ణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జమున

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివా రులోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో పీజీ చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులకు వివిధ కేటగిరీలలో ప్రతిభ చాటారు. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈనెల 12, 13, 14 తేదీల్లో ఏడవ ఏపీఎం ఏపీ స్టేట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల పెథా లజీ మొదటి సంవత్సరం పీజీ విద్యార్థిని డాక్టర్ వీజే అర్ష తమ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ డి.కళ్యాణి మార్గదర్శకత్వంలో ప్రజెంట్ చేసిన పోస్టర్ ప్రజెంటేషన్‌కు మొదటి బహుమతి లభించింది. ఈ బహుమతిని అందుకున్న డాక్టర్ వి.జె.హర్షను కడప వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున అభినందించారు. అలాగే మంగళగిరి ఎయిమ్స్‌లో సెప్టెంబరు 13, 14 తేదీలలో ఏపీఏఆర్ఓఐసీఓఎన్ 2025 రాష్ట్ర రేడియేషన్ అంకాలజిస్టుల సదస్సు నిర్వహించారు. ఇందులో కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు చెంది న ద్వితీయ సంవత్సరం రేడియేషన్ అంకాలజిస్ట్ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థిని డాక్టర్ బి.సుదేష్ణ తమ గైడ్ డాక్టర్ ప్రవీణ మార్గదర్శకత్వంలో చేసిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున అభినందనలు తెలిపారు.

హైదరాబాద్, చెన్నై రైళ్లను ఆపాలి



స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కన్‌సల్టేటీవ్ మెంబర్లు

కొండాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, చెన్నై రైళ్లను కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆపాలని కన్సల్టేటివ్ మెంబర్‌లు కోరారు. సోమ వారం వారు స్టేషన్‌మాస్టర్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజే శారు. కరోనా ముందు కొండాపురం స్టేషన్‌లో ఆగే కాచిగూడ- చిత్తూర్ ఎక్స్‌ప్రెస్ (12797/12798), ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22159/22160) రైళ్లకు తిరిగి స్టాపింగ్ పునరుద్ధరించాలని కోరారు. ఇటీవల కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ పునరుద్ధరించిన విధంగా, ఈ రైళ్లకు స్టానింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్‌సల్టేటివ్ మెంబర్లు శ్రీరామ్‌రెడ్డి, మనోహర్‌బాబు, నాగేష్, సాయిచరణ్, ఖాదర్‌భాషా, జయంత్ తదిత రులు పాల్గొన్నారు.

బిందు సేద్య పరికరాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర్ల సేద్య ఎరికరాలు రైతులు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా పథక సంచాలకులు వెంకటేశ్వర్‌రెడి అన్నారు. సోమవారం మండలం లోని రంగసముద్రం రైతు సేవా కేంద్రంలో పోరుమామిళ్ల వ్యవసాయ డివి జను పరిధిలో వ్యవసాయ, ఉద్యాన గ్రామ సహాయకులకు బిందు, తుంపర్లసేద్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పంటల్లో డ్రిప్ ఇరిగేషను పద్ధతిలో మొక్క లకు కావాల్సిన ఎరువులు, ఇతర పోషకాలను నీటితో పాటు అందించడం ద్వారా ఎరువుల ఆదా జరుగుతుందన్నారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న సన్న చిన్న కారు రైతులకు 90శాతం రాయితీతో గరిష్టంగా 2.18 లక్షల వరకు బిందు సేద్య పరికరాలు అమర్చుకోవచ్చన్నారు. 5-10 ఎకరాల మధ్య భూమి కలిగిన పెద్ద రైతులకు రాయితీతో గరిష్టంగా 3.46 లక్షల వరకు, 10 ఎకరాల పైబడి పొలం కలిగిన రైతులకు 50శాతం రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మైక్రోఇరిగేషన్ ఏరియా అధికారి మహేశ్‌బాబు, ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండిలో టెంకాయల విక్రయ హక్కు కోసం టెండర్లు

చక్రాయపేట, సెప్టెంబరు 15: గండి క్షేత్రంలో టెంకాయలు విక్రయిం చుకునే హక్కుకోసం ఈ నెల 17వ తేదీ బుధవారం సీల్డ్‌టెండర్లు/ బహి రంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ జె.వెంక ట సుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్‌దారులు రూ.10లక్షలు డిపాజిట్ నగదుగా కానీ, డీడీ ద్వారా గానీ చెల్లించి టెండ ర్లలో పాల్గొనాలన్నారు. ఏడాదిపాటు టెంకాయల విక్రయించుకునేందుకు హక్కును టెండర్‌దారునికి కల్పిస్తామని తెలిపారు.

మా గోడు యూసీఐఎల్‌కు పట్టదా..!

● ఆర్డీఓ కార్యాలయం ఎదుట

కేకే కొట్టాల ప్రజల ఆందోళన



ఆర్డీఓతో మాట్లాడుతున్న కేకే కొట్టాల ప్రజలు

పులివెందుల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్)కు ఎన్నోఏళ్లుగా మా సమస్యలను విన్నవిస్తున్నా వారికి చీమకుట్టినట్లు కూడా లేదని కేకే కొట్టాల ప్రజలు ఆరోపించారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో పులివెందుల ఆర్డీ ఓ కార్యాలయం ఎదుట వారు ఆందోళనకు దిగారు. దీంతో ఆర్డీఓ చిన్నయ్య కార్యాలయంలో వారితో చర్చ లు జరిపేం దుకు ఆహ్వానించారు. అప్పటికే యూసీఐఎల్‌కు సం బంధిం చిన పలువురు అధికారులు ఆర్డీఓతో చర్చిస్తున్నారు. అక్క డకు వెళ్లీవెళ్లగానే కెకెకొట్టాల ప్రజలు యూసీఐఎల్ అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నేళ్ల నుంచి మా సమ స్యలు మీ దృష్టికి తెస్తున్న మీకు పట్టదా.. కావాలనే మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆర్డీఓ చాంబర్‌లో ప్రజలందరు వచ్చేందుకు వీలుకాక పోవడంతో సభాభవనంలో చర్చ సాగించారు. ఈ సంద ర్భంగా టీడీపీ నాయకుడు శ్రీనాథ్‌రెడ్డి కెకె కొట్టాల ప్రజల తరఫున మాట్లాడారు. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి టెయిలింగ్ పాండ్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. 2017లో ఒకసారి, 2021లో మరోసారి ఇలా నాలుగేళ్లకు ఒక సారి టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు సాగిస్తున్నారన్నారు. ఈ విస్తరణ పనులు సాగిస్తున్న ప్రతిసారి కెకెకొట్టాల ప్రజలు వారి పొలాలను పూర్తిగా స్వాధీనం చేసుకొని నష్టపరిహారం చెల్లించి ఆర్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేస్తు న్నారన్నారు. ఇప్పుడు మరోసారి విస్తరణపనులు చేసేందుకు యూసీఐఎల్ సిద్ధమైందన్నారు. ఈ పనులను ప్రజలు రెండు మార్లు అడ్డుకున్నారన్నారు. యూసీఐఎల్ మనుగడ ఇబ్బంది అవుతుందని, టెయిలింగ్ పాండ్ విస్తరణ సరైందేనప్పటికి ప్రజల ఇబ్బందులు కూడా గుర్తించాలని అధికారులకు వివ రించారు. అందుకు యూసీఐఎల్ అధికారులు, ఆర్డీఓ మాటా డుతూ కేకే కొట్టాల రైతులు భూములను యూసీఐఎల్ తీసుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. భూము లసర్వే తదితర కార్యక్రమాలు ముగించుకొని వారికి నష్టపరి హారం చెల్లించేందుకు దాదాపు రెండేళ్లలో ముగించేందుకు యూసీఐఎల్ ఒప్పుకుందన్నారు. కాబట్టి టెయిలింగ్‌పాండ్ విస్తరణకు ఆటంకం కలిగించవద్దన్నారు. ఇందుకు కేకే కొట్టాల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపించాయి. యూసీఐఎల్ ఇప్పటికి ఎన్నోమార్లు ఇలాంటి మాటలు చెప్పి తప్పించుకున్నారన్నారు. 2021 విస్తరణపనుల్లో ఇలాంటి మాటలు చెప్పి పనులు సాగించారన్నారు. 2024లో విస్తరణ పనులు అవసరమవుతాయని తెలిసి మా సమస్యలు ఎందు కు పరిష్కరించలేదని ప్రశ్నించారు. దీనికి యూసీఐఎల్ ప్రతినిధులు ఇక్కడ జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామని చెప్పారు. దీంతో తమకు సరైన పరిష్కారం చూపేవరకు టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు ముందుకు సాగనివ్వమన్నారు.

జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ ఎంపికలు



ఎంపికైన సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ మైదానంలో సోమవారం ప్రతిభే కొలమానంగా జిల్లాస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా సాఫ్ట్ టెన్నిస్ కార్యదర్శి రేవంత్ ఆధ్వర్యంలో సాగిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో మహిళల విభాగంలో అభిగేల్ మోక్ష గ్రీహిత, హర్షిక, తేజస్విని, సుప్రీత, హన్సీ, వేరోనిక, స్వర్ణజిత ఎంపికయ్యారు. అలాగే పురుషుల విభాగంలో బిలాల్, వరుణ్, మల్లిఖార్జున, నాగరాజు, మునెయ్య, రెడ్డయ్య, చంద్రశేఖర్, ఉదయ్ ఎంపికయ్యారు. క్రీడా ఎంపికల కార్యక్రమంలో జిల్లా స్కూలు గేమ్స్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు శివశంకర్‌రెడ్డి, డీఎస్ఏ కోచ్ శ్యామ్యుల్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా సాగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో సోమవారం నగర డీఎస్ఏ మైదానంలో సెపక్‌తక్రా, రెజ్లింగ్, నెట్ బాల్ క్రీడలు నిర్వహించారు. ఇందులో 14, 17 సంవత్సరాల విభాగాల్లో ఎంపి కలు జరిగాయి. ఉమ్మడి కడప జిల్లా నుంచి సుమారు 350 మంది క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో దాదాపు 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూది మందు వికటించి మున్సిపల్ ఉద్యోగి మృతి



రంగనాయకులు (ఫైల్)

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దు టూరు మున్సిపాలిటీలో వాటర్ వర్క్సు సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగి రంగనాయకులు (54) ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల రంగనాయకులు కింద పడి చేయి దెబ్బతి నడం తో గాంధీ రోడ్డులోని ఎముకల వైద్యుని వద్ద చికిత్స కోసం చేరాడు. గాయం అయిన చేతికి వాపు తగ్గాక ఆపరేషన్ చేస్తామని వైద్యుడు తెలిపారు. మూడు రోజుల పాటు అక్కడే వైద్యం చేయించుకున్న రంగనాయకులుకు సోమ వారం ఆపరేషన్ చేయడానికి యాంటిబయోటిక్ సూది మందు పడుతుందో లేదో అని చేతికి టెస్టు డోస్ ఇచ్చా రు. అది వికటించి వెంటనే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. యాంటిబయోటిక్ ఇన్‌జెక్షన్ కేవలం టెస్టు డోస్ వేయగానే అది కార్డియాక్ అరెస్టు జరిగి ఉండ వచ్చని వైద్యుడు విద్యాసాగర్‌రెడ్డి వెల్లడిస్తున్నారు. కానీ రంగనాయకులు కుటుంబసభ్యులు ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఈఈ ఎం శ్రీనివాసులు ఆసుపత్రికి వచ్చి రంగనాయ కు లు మృతదేహాన్ని పరిశీలించి.. ఆసుపత్రి వైద్యున్ని విచా రించారు. పోస్టుమార్టం చేస్తే తెలుస్తుందని, వైద్య సేవల్లో లోపం ఉంటే తమపై చర్యలు తీసుకోవచ్చని వైద్యుడు విద్యాసాగర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు తెలిపారు.

ఫైనాన్స్ బాకీ కట్టలేక యువకుడు ఆత్మహత్య

మైదుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ బాకీ కట్టలేక పట్టే రమేశ్ (22) అనే యువకుడు విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ ఫైనాన్స్ కంపెనీలో 2003లో తన ఇంటిని కుదవపెట్టి రూ.4లక్షల 25వేలు రుణం తీసుకున్నాడు. పాతగుడ్డల వ్యాపారం చేసుకుని జీవనం సాగించే రమేశ్ వ్యాపారం లేక ఫైనాన్స్ కట్టకపో వడంతో తన గృహం తనకు కాకుండా పోతుందేమోనని గత శుక్రవారం విషద్రావనం తాగి ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. అయితే అతని పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆ మేరకు అతని తండ్రి ఓబులేసు మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌లో దొంగతనం

వల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి స్థానిక విద్యుత్ సబ్ స్టేషనుకు సమీపంలోని హోటల్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. బాధితుల వివరాల మేరకు.. చిన్నలేబాక గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతులు చిన్న రేకుల షెడ్డు వేసుకుని హోటల్ పెట్టుకున్నారు. ఆదివారం రాత్రి హోటల్‌లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా దొంగలు షట్టరుకు వేసిన లాక్ పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాదాపు రూ.40 వేలుకు పైగా విలువ చేసే హోటల్‌లోని వస్తు సామగ్రిని తీసుకెళ్లినట్లు తెలిపారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 లోపు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిపులు పొందడానికి కళాశాల విద్యార్థులు కళాశాల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికార అధికారి కొమ్మద్ది సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమోదు చేసు కున్న విద్యార్థులు బయోమెట్రిక్ పూర్తి చేయాలని సూచించారు. సంబం ధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది వారి కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి జిల్లా సంక్షేమశాఖలకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులు తక్షణమే పంపాలన్నారు. కళాశాలలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు వారికి సంబంధించిన సచివాల యాల్లో వెరిఫికేషన్ పూర్తి చేయిం చుకోవాలన్నారు. కళాశాలల్లో చదువు తున్న ఎస్సీ విద్యా ర్థులకు ఆధార్‌తో లింకు అయిన బ్యాంకు అకౌంటుకు మాత్రమే స్కాలర్‌సిప్ జమ అవుతుందని తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ విద్యార్థులు జాయింట్ అకౌంటు వివరాలను కళాశాలలో, సంబంధిత సచివాలయాల్లో ఇవ్వాలని తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైల వరం జలాశయానికి సోమవారం ఉదయం నుంచి నీరు నిలుపుదల చేసి నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు నుంచి ప్రాజెక్టులోకి వచ్చే కృష్ణాజలాలను నిలిపివేయడంతో మైలవరానికి నీరు నిలుపుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వాగులు, వంకలు, పెన్నా చిత్రావతి నదుల ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 1000 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా, గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు.

వంక నీటిలో కొట్టుకుపోయి ఎద్దులు మృతి

● బయటపడిన యజమాని, కూలీలు



ఖాజీపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖా జీపేట మండల పరిధి లోని సుంకేసుల గ్రా మానికి చెందిన ఆదిరె డ్డి ఎద్దుల బండితో ఉ దయం వంక దాటుకు ని పోయి పని ముగిం చుకుని వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన భాస్కర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి తిరిగి ఎద్దుల బండిలో వస్తుం డగా యజమాని మాత్రం వంకలోనీరు అధికంగా వస్తోం దని చెప్పినప్పటికి బండిలోని వారు ముగ్గురు రోజు మే ము వెళుతాం ఏం కాదులే అని చెప్పడంతో ఎద్దుల బం డిని కదిలించాడు. అయితే వంక మధ్యలోకి రాగానే బం డి పల్టీ కొట్టడంతో బండి కింద యజమాని పడగా మిగ తా ముగ్గురు నీటిలో దూకి ఒడ్డుకు చేరుకున్నారు. యజ మాని మాత్రం కంపచెట్లను పట్టుకుని ఉండటాన్ని గమ నించిన చుట్టుపక్కలవారు ఆదిరెడ్డిని కాపాడారు. అయి తే వృషభరాజములు మృతి చెందడంతో రైతు లబోదిబో మంటూ కన్నీరు మున్నీరయ్యాడు. కొద్దిరోజుల క్రితమే వీ టిని రూ.1.50 లక్షలు పెట్టి కొన్నానని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు కోరారు. సీఐ వంశీధర్ అక్కడకు చేరుకొని పరిశీలించారు.

రేపటి నుండి మండల స్థాయి క్రీడా పోటీలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక (తెలుగు) జడ్పీహైస్కూల్‌లో ఈనెల 17వ తేదీ నుండి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 పద్మావతి, హెచ్‌ఎమ్ అంజాద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మండంలలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 17, 18వ తేదీల్లో జరిగే అండర్-14, 17 బాల బాలికలకు కబడ్డీ, కోకో, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చేసిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో ఆడతారని తెలిపారు.

నేటి నుండి తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో ఈనెల 16, 17వ తేదీలలో రెండు రోజుల పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, బాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర పోటీలు జరుగుతాయన్నారు.

నేటి నుండి చెంబకూరులో..

రామసముద్రం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో ఈనెల 16తేదీ మంగళవారం మేజర్ పంచాయతీ చెంబకూరు జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-2 ఆంజనేయులు, మండల ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ దిలీప్‌కుమార్, హెచ్‌ఎం రమేశ్‌బాబు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, ఝాన్సీ, పీడీలు దిలీప్, పార్థ, ఉదయ్, మోహన్, రమాదేవి, ఇందిర పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలలో బాలికల ప్రతిభ

వాల్మీకిపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమంచూరు ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి సుమారు 400 మంది విద్యార్థులు క్రీడలు, అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనగా 200మంది డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ హరినాథ్, పీఈడీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

గుర్రంకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే చెత్తచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి రోగాలు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు తాగు నీటి సమస్యలు లేకుండా తగిన ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



1408మంది కొత్త పంతుళ్లు

- డీఎస్సీ విజేతల జాబితా ప్రకటించిన విద్యాశాఖ
- శిక్షణ అనంతరం విధుల్లో చేరనున్న టీచర్లు
- అభ్యంతరాల స్వీకరణకు హెల్ప్‌డెస్క్‌లో అవకాశం



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాజా డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408మంది (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. దరఖాస్తుల స్వీకరణతో ఈ ఏడాది ఏప్రిల్ 20న మొదలైన ప్రక్రియ పలు దశలు సాగి ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408మంది అభ్యర్థులు (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో అర్హత సాధించినట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సోమవారం ప్రకటించింది. ఫైనల్ సెలక్షన్ జాబితాను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌తో పాటు చిత్తూరు డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లోని 84989 91250 నెంబరులో సంప్రదించాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. వివిధ కారణాలతో మిగిలిన 70 పోస్టులను వచ్చే ఏడాది నిర్వహించే డీఎస్సీలో భర్తీ చేయనున్నారు. నూతన ఉపాధ్యాయులకు దసరా సెలవుల సమయంలో అంటే 22 నుంచి 29వ తేది వరకు ఎనిమిది రోజుల పాటు ట్రైనింగ్ కార్యక్రమం చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తారు. ట్రైనింగ్ సమయంలో కౌన్సిలింగ్ నిర్వహించి, ప్లేస్‌మెంట్ ఆర్డర్ (ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ ఆర్డర్) జారీ చేయనున్నారు. ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి కాగానే నూతన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంది.

యాజమాన్యాల వారీగా భర్తీ చేసిన పోస్టులు

యాజమాన్యం	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ప్రభుత్వ/లోకల్‌బాడీ	1254	58
మున్సిపాలిటీ	57	7
మున్సిపల్ కార్పొరేషన్	92	5
ట్రైబల్ వెల్ఫేర్/ఆశ్రమ	5	0
మొత్తం	1408	70

● సబ్జెక్టులు/పోస్టుల వారీగా...

సబ్జెక్టు/పోస్టు	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ఎస్‌ఏ(ఎల్)ఇంగ్లీష్	102	2
ఎస్‌ఏ(ఎల్)హిందీ	16	1
ఎస్‌ఏ(ఎల్)తెలుగు	33	0
ఎస్‌ఏ(ఎల్)ఉర్దూ	2	2
ఎస్‌ఏ(ఎల్)తమిళం	-	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)బయాలజీ	59	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)బయాలజీ (త)	2	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)బయాలజీ (ఉ)	1	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)మ్యాథమెటిక్స్	27	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)మ్యాథమెటిక్స్(త)	1	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)మ్యాథమెటిక్స్(ఉ)	1	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)పీడీ	86	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)ఫిజికల్ సైన్స్	29	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)ఫిజికల్ సైన్స్(త)	-	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్) సోషియల్ స్టడీస్	117	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)సోషియల్ (త)	5	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)సోషియల్ (ఉ)	5	2
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	885	6
ఎస్జీటీ (తమిళం)	5	2
ఎస్జీటీ(ఉర్దూ)	32	48
మొత్తం	1408	70

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



కేక్ కట్ చేస్తున్న ఎంపీడీవో రాజేశ్వరి

పీలేరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను మార్గదర్శకంగా తీసుకొని జీవితంలో ముందుకు పోవాలని ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా పీలేరు పంచాయతీ రాజ్ డివిజనల్ కార్యాలయంలో సోమవారం మోక్షగుండం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ రామక్రిష్ణ నాయక్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ వ్యవస్థలో ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా తమ పనితీరుకు మెరుగు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కేవీపల్లె ఏఈ సుబ్రత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్లకు ఘన సన్మానం



కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న కూటమి నాయకులు

మదనపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల కింద నియమించిన డైరెక్టర్లను కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో సోమవారం నియోజకవర్గ పరిశీలకుడు శివరామ్‌ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం డైరెక్టర్ పి.రామకృష్ణాచారి, వాల్మీకి సంఘం నుంచి మండ్యం ప్రభాకర్, దేవరింటి శ్రీనివాసులు, పి.భావన, ఎస్.నాగూర్‌వలి ఉన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడు, బావాజాన్, ఎం. ప్రభాకర్, సీబీఎస్ రెడ్డెశేఖర్ ప్రసాద్, దేవా రమేష్, లక్ష్మన్న, శ్రీకాంత్, ఇడ్లీ రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, మదనపల్లె అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలను నిర్వహిస్తామని చెప్పడం ప్రజలను మోసం చేసినట్టేనన్నారు. పీపీపీ విధానంలో పేదలకు ఉచిత వైద్యం అందదని, బలహీన వర్గాలు ఎంబీబీఎస్ కోర్సులో రిజర్వేషన్ సదుపాయం కోల్పోతారన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కళ్యాణికి వినతిపత్రం అందజేశా రు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రెడ్డిసాహె బ్, సీపీఐ మురళి, సీపీఎం శ్రీనివాసులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలపై అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించం

- టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వం పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని వుంటే మాజీ సీఎం వైఎస్ జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, ఇది సహించబోమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను నిర్మించి, ప్రజలకు వైద్యసేవలందిస్తామని ఢాంబికాలు పలికిన జగన్, అప్పట్లోనే మెడికల్ కళాశాలల పేరిట నాబార్డు నుంచి రూ.3,731 కోట్లు రుణం తీసుకుని, ఆ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. దీంతో మెడికల్ కళాశాలల నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయన్నారు. గత ఏడాది రాష్ట్రంలో మూడు కళాశాలల్లో నిర్మించిన అరకొర భవనాల్లో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించారని, ఇప్పుడు రెండో సంవత్సరానికి వచ్చిన విద్యార్థులకు తరగతి గదులు, ఇతర సౌకార్యలు లేవని, వారెక్కడికి వెళ్లి చదుకోవాలని ప్రశ్నించారు. అందుకే సీఎం చంద్రబాబు పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు వైద్యసేవలందించడానికి కృషి చేస్తున్నారన్నారు.

గాలికుంటు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

కురబలకోట/నిమ్మనపల్లె/తంబళ్లపల్లె/రామసముద్రం/వాల్మీకిపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి సోకకుండా అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ డీడీ శ్రీనివాసుల నాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని కురబలకోట పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధికి పశువులు గురైతే పాల దిగుబడి తగ్గి రైతులు ఎంతో ఆర్థికంగా నష్టపోతారన్నారు. జ్వరం, నీరసం, కాలి గిట్టల మధ్య పుండ్లు, నోటి నుండి చొంగ కారడంతో పాటుగా ఆ పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రధానంగా పశువులకు తప్పనిసరిగా ప్రతి ఏడాది టీకాలను వేయించాలన్నారు. అలాగే నిమ్మనపల్లి మండలంలో పశువైద్యాధికారి సురేశ్, తంబళ్లపల్లెలో పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె, కాప్పల్లె పంచాయతీలలో పశువులకు డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధులకు టీకాలు వేశారు. వ్యాక్సినేషన్ ద్వారా పశువులలో గాలికుంటు వ్యాధిని నివారించవచ్చునని వాల్మీకిపురం వెటర్నరి ఏడీ విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో పాడి పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సుజనశ్రీ, గణేష్, కార్తీక్, నిర్మల, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



ఆవుకు గాలికుంటు టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీనివాసులు

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వంక పొరంబోకు స్థలాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జోన్-4 ఇన్‌చార్జి ఓసూరి కిరణ్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కళ్యాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డు పంచాయతీలోని సర్వేనెంబర్ 832లో ఉన్న వంక పొరంబోకు స్థలంలో లక్ష్మమ్మ అనే మహిళ అక్రమ నిర్మాణాలు చేపట్టిందని, దీనిపై విచారించి నిర్మాణాలను తొలగించాలని ఫిర్యాదు చేశారు. తమకు చెందిన సెటిల్‌మెంట్ భూమిని మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రొహిబిటెడ్ లిస్టులో వుంచారని, ఈ విషయమై విచారించి న్యాయం చేయాలని మదనపల్లెకు చెందిన ఎస్.రాజశేఖర్‌బాబు, గతంలో ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసినా రెవెన్యూ అధికారులు పట్టా ఇవ్వడం లేదని కొత్తపల్లెకు చెందిన రెడ్డిప్రసన్న సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి వాటిని సకాలంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. డీఏవో నిర్మలదేవి, అధికారులు పాల్గొన్నారు.

జీవాలు కోల్పోయిన బాధితురాలికి రూ.50వేలు ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థికసాయం అందచేస్తున్న చంద్ర, తదితరులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుతో మూగ జీవాలు కోల్పొయిన బాధితురాలికి రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర రూ.50వేల ఆర్థికసాయం అందించారు. తంబళ్లపల్లె మండలం ఆర్‌ఎన్ తాండా పంచాయతీ బోనాసివారిపల్లెకు చెందిన రెడ్డమ్మ గొర్రెలు, పొట్టేళ్లు మేపుకుని జీవనం సాగిస్తుండగా ఆగస్టు 9వ తేదీన పిడుగు పాటుకు గురై 47 జీవాలు మృతి చెందాయి. ఈ అనుకోని ఘటనతో రెడ్డమ్మ సుమారు రూ.6 లక్షల వరకు నష్టపోయి జీవనోపాధి కోల్పోయింది. ఈ క్రమంలో రెడ్డమ్మ కుమారుడు రమేష్‌కు చంద్ర, టీడీపీ నాయకులు రూ.50వేల నగదు సహాయం అందచేశారు. ఆయన వెంట రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, మాజీ సర్పంచ్ ఉత్తమ్‌రెడ్డి, పెద్దేరు చైర్మన్ కొటాల శివకుమార్, జగదీష్, భాస్కర్, ధనశేఖర్, రమణ, సుధాకర్, జయరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

బండ భూమిని కాపాడాలని వినతి

కలికిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టపాలెం గ్రామంలో కలికిరి-కందూరు మార్గం పక్కనే వున్న 20 ఎకరాల ప్రభుత్వ బండ భూమిని ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని వాడావాండ్లఎల్లె గ్రామానికి చెందిన ప్రజలు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు తహసీల్దారు హరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మెయిన్ రోడ్డు పక్కనే వున్న 20 ఎకరాల బండ భూమి పైనే బోయకొండ గంగమ్మ ఆలయం వుందని, ప్రతి ఏటా ఇక్కడ అమ్మవారి జాతర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఆలయానికి చుట్టుపక్కల వుండే దాదాపు పది గ్రామాల ప్రజలకు మొక్కుబడులు చెల్లించడానికి ఇదే ప్రధాన ఆలయమని, పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీలను ఆచరించడానికి భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి వుందన్నారు. ప్రస్తుతం ఈ బండ భూమిని ఆక్రమించుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నట్లు తహసీల్దారు దృష్టికి తెచ్చారు. ప్రజావసరాల దృష్ట్యా ఈ భూమిని ఆక్రమణల నుంచి కాపాడి అమ్మవారి ఆలయానికి కేటాయించాలని కోరారు. భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించాల్సిందిగా మండల సర్వేయరు రెడ్డెప్పను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యతీంద్రకుమార్, వెంటసుబ్రమణ్యం, బాలకృష్ణ తదితరులు వున్నారు.

18న ఐసీడీఎస్ జీపు బహిరంగ వేలం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సంబంధించిన జీపును ఈనెల 18వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు సీడీపీవో నాగవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జీపు విలువ రూ.26,400 వున్నట్లు ఆర్టీవో అధికారులు ధ్రువీకరించారన్నారు. గురువారం ఉదయం 10గంటలకు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిర్వహించే వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.1000 డీడీని చైల్డ్ డెవలప్‌మెంట్, మదనపల్లె ప్రాజెక్టు అధికారి పేరిట చెల్లించాలన్నారు.

ఈ-పోస్ మిషన్లు పంపిణీ

మదనపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో మూడోరోజు సోమవారం 98 మంది రేషన్ షాపులకు సంబంధించిన ఈ-పోస్ మిషన్లు పంపిణీ చేశారు. మార్కెట్‌యార్డులోని సివిల్‌సప్లయ్ గోదాములో సీఎస్ డీటీ చాణిక్య ఆధ్వర్యంలో రేషన్ డీలర్లకు అందజేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల రేషన్‌డీలర్ల సంఘం నాయకులు శివారెడ్డి, జంగా రా ఘవరెడ్డి, ఈశ్వరయ్య, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో స్వామిత్వ సర్వే పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వే రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా స్వామిత్వ సర్వే నత్తనడకన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని టీమ్‌లుగా ఏర్పడి త్వరతగతిన సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. స్వామిత్వ సర్వేకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరలు పాల్గొన్నారు.

రూ.10కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చేపట్టినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె మండలం పొన్నేటిపాళెం, కోళ్లబైలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మండలాల్లో దారులు లేని గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు, ఇది వరకు పూర్తి చేసిన ఉపాధి పనుల వేతనాలు చెల్లిస్తామన్నారు. అనంతరం ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పీఆర్ ఏఈ రమణ, ఏపీవో చెన్నకేశవులు, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచా యతీ దాదంవడ్డిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. దాదంవడ్డిపల్లెలో సుమారు 15 రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో థామస్ రాజ వెంటనే బోరుకు మోటారు బిగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో సోమవారం ఉదయమే బోరులో మోటారు, పైపులను దించి నీటి సమస్యను పరిష్కరించారు.